ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



పెద్దపల్లి జిల్లా వార్తలు

5★

శుక్రవారం 5 జనవరి 2024



తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి - ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ 8లో..

ప్రజా పాలన సభల్లో దరఖాస్తుల వెల్లువ 8లో..


# డీఎస్సీపై చిగురిస్తున్న ఆశలు

- మెగా డీఎస్సీ నిర్వహిస్తామని సీఎం వెల్లడి
- జిల్లాలో భర్తీకానున్న మరిన్ని ఉపాధ్యాయ పోస్టులు



(ఆంధ్రజ్యోతి, పెద్దపల్లి)

రాష్ట్రంలోని ప్రభుత్వ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులన్నింటినీ భర్తీ చేసేందుకు మెగా డీఎస్సీ నిర్వహిస్తామని ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రకటించారు. దీంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. గత ఏడాది సెప్టెంబర్ మొదటి వారంలో రాష్ట్ర వ్యాప్తంగా 5,089 పోస్టులను భర్తీ చేసేందుకు గత ప్రభుత్వం నోటిఫికేషన్ జారీ చేయగా, అనేక మంది నిరుద్యోగులు దరఖాస్తు చేసుకున్నారు. నవంబరు 20 నుంచి 30వ తేదీ మధ్యలో రాత పరీక్ష నిర్వహించేందుకు రంగం సిద్ధం చేయగా, అసెంబ్లీ ఎన్నికల నోటిఫికేషన్ వెలువడడంతో రాత పరీక్ష నిర్వహించలేదు. రాష్ట్రంలో 9,800 పోస్టులు ఖాళీగా ఉన్నప్పటికీ, రేషనలైజేషన్ ఆధారంగా అప్పటి ప్రభుత్వం 5,089 పోస్టులకే నోటిఫికేషన్ జారీ చేసింది. ఆ సమయంలో నిరుద్యోగులు మొత్తం ఖాళీలను నోటిఫికేషన్‌లో భర్తీ చేయాలని ఆందోళనలు నిర్వహించినప్పటికీ ప్రభుత్వం పట్టించుకోలేదు. డిసెంబరు 30వ తేదీన రాష్ట్ర విద్యా శాఖాధికారులతో సీఎం రేవంత్‌రెడ్డి నిర్వహించిన సమీక్షా సమావేశం సందర్భంగా ఉపాధ్యాయ పోస్టుల ఖాళీల గురించి ఆరా తీశారు. 9,800 పోస్టులు ఖాళీగా ఉన్నట్లు అధికారులు తెల్పగా, వాటన్నింటినీ భర్తీ చేసేందుకు రంగం సిద్ధం చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో విద్యా శాఖ ఏయే జిల్లాలో ఎన్ని పోస్టులు ఖాళీగా ఉన్నాయో వివరాలు పంపించాలని జిల్లా అధికారులకు ఆదేశాలు జారీఅయ్యాయి. జిల్లాలో 549 ప్రభుత్వ పాఠశాలలున్నాయి. ఈ పాఠశాలలకు 2494 పోస్టులు మంజూరుకాగా, 2,224 మంది ఉపాధ్యాయులు పనిచేస్తుండగా, 270 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో జీహెచ్‌ఎం-2 పోస్టులు 2, స్కూల్ అసిస్టెంట్ గణితం 24, భౌతికశాస్త్రం 6, జీవశాస్త్రం 26, సాంఘిక శాస్త్రం 56, ఇంగ్లీష్ 9, తెలుగు 15, హిందీ 17, ఉర్దూ 2, పీడీ 5 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. భాషా పండితులు తెలుగు 3, హిందీ 2, వ్యాయామ ఉపాధ్యాయులు ఒకటి, ఎల్‌ఎఫ్‌ఎల్ హెచ్‌ఎం 34, ఎస్జీటీలు 29 పోస్టులు, పీఈటీ ఒక పోస్టు ఖాళీగా ఉన్నాయి. ఖాళీగా స్కూల్ అసిస్టెంట్ పోస్టుల్లో 70 శాతం పదోన్నతుల ద్వారా భర్తీ చేయాల్సి ఉంటుంది. మిగతా 30 శాతం నేరుగా భర్తీ చేయనున్నారు. ఎస్‌జీటీ, పీఈటీ, భాషా పండిత పోస్టులను నేరుగా భర్తీ చేయనున్నారు. ఈ లెక్కన స్కూల్‌అసిస్టెంట్ పోస్టులు 48, ఎస్జీటీలు 29, భాషా పండితులు 6, మొత్తం 83 పోస్టులు భర్తీ అయ్యే అవకాశాలున్నాయి. నోటిఫికేషన్ నాటికి మరిన్ని పోస్టులు ఖాళీకావచ్చని అధికారులు అంచనా వేస్తున్నారు.

### ● డీఎస్సీకి ముందు టెట్ నిర్వహించే అవకాశం..

సెప్టెంబర్‌లో జారీచేసిన నోటిఫికేషన్‌లో స్కూల్ అసిస్టెంట్ 30, ఎస్జీటీలు 7, భాషా పండితులు 5, పీఈటీ పోస్టు ఒకటి, మొత్తం 43 పోస్టుల భర్తీ కోసం నోటిఫికేషన్ జారీ చేశారు. గడువులోపు చాలా మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకున్నారు. జిల్లాలో బీఈడీ, డీఈడీ చేసిన వాళ్లు 1500 మందికి పైగా ఉన్నారని అంచనా. ఎన్నో ఏళ్లుగా డీఎస్సీ నోటిఫికేషన్ కోసం ఎదురు చూస్తున్నారు. తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించిన తర్వాత డీఎస్సీని రద్దు చేసిన ప్రభుత్వం తొలిసారిగా 2017లో టీచర్స్ రిక్రూట్‌మెంట్ టెస్టు పేరిట సుమారు 13 వేల పోస్టులను రాష్ట్రవ్యాప్తంగా భర్తీ చేసింది. ఈ నియామకాలను కొత్త జిల్లాల ప్రాతిపదికన కాకుండా ఉమ్మడి జిల్లాల ప్రాతిపదికన చేపట్టింది. ఆ తర్వాత టీచర్ల నియామకాలు చేపట్టలేదు. ప్రభుత్వం ఎస్సీ, బీసీ, మైనార్టీ గురుకుల విద్యాలయాలను ప్రతి నియోజకవర్గానికి రెండు చొప్పున ఏర్పాటుచేయడంతో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య తగ్గుముఖం పట్టింది. దీంతో ఖాళీ పోస్టులను భర్తీ చేయలేకపోయింది. విద్యార్థులున్న చోట ఉపాధ్యాయులు తక్కువగా, విద్యార్థులు లేనిచోట ఉపాధ్యాయులు తక్కువగా ఆయా పాఠశాలల్లో ఉండడంతో ఆ సమస్యను రేషనలైజేషన్ చేపట్టి ఉపాధ్యాయులను సర్దుబాటు చేసి విద్యా బోధన సాగించారు. నియామకాలు చేపట్టకపోవడంతో ఉపాధ్యాయుల పదోన్నతుల ప్రక్రియను దీర్ఘకాలంగా నిలిపివేసినప్పటికీ, సెప్టెంబర్‌లో చేపట్టిన పదోన్నతులపై కొందరు ఉపాధ్యాయులు కోర్టును ఆశ్రయించడంతో కొన్ని కేటగిరీలకు సంబంధించి ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియ నిలిచిపోయింది. ఇంతలో అసెంబ్లీ ఎన్నికలు జరగడం, రాష్ట్రంలో కొత్త ప్రభుత్వం ఏర్పాటు కావడంతో విద్యా శాఖపై సమీక్ష చేసిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మెగా డీఎస్సీ నిర్వహణకు సన్నద్ధం కావాలని ఆ శాఖాధికారులను ఆదేశించడంతో నిరుద్యోగుల్లో ఆశలు చిగురిస్తున్నాయి. పార్లమెంట్ ఎన్నికల నోటిఫికేషన్‌కు ముందే డీఎస్సీ నోటిఫికేషన్ జారీఅయ్యే అవకాశం ఉంది. దీనికంటే ముందు టెట్ పరీక్ష నిర్వహించనున్నట్లు సమాచారం.

## రోగులతో ప్రేమగా వ్యవహరించండి

- ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ - వైద్యులతో సమీక్ష సమావేశం



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, జనవరి 4: వైద్యం కోసం వచ్చే రోగుల పట్ల ప్రేమగా వ్యవహరించాలని రామగుండం ఎమ్మెల్యే రాజ్‌ఠాకూర్ మక్కాన్‌సింగ్ వైద్యులకు, వైద్య సిబ్బందికి సూచించారు. గురువారం గోదావరిఖని ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలోని రోగులకు అందుతున్న వైద్యంపై రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రిలోని లేబర్ రూమ్, జనరల్ వార్డు ఆర్థో, చిల్డ్రన్ వార్డుతో పాటు టాయ్‌లెట్లను పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ అనేక సమస్యలతో ఆసుపత్రికి రోగులు వస్తారని, వారిపైన దురుసుగా ప్రవర్తించకుండా వారికి వైద్య సేవలు అందించాలని సూచించారు. కొంత మంది సిబ్బంది రోగుల నుంచి బలవంతంగా డబ్బులు వసూలు చేస్తున్నారని తన దృష్టికి వచ్చిందని, తాను ఒక రోజు ఆసుపత్రికి వస్తే పేదలైన రోగుల నుంచి డబ్బులు బలవంతంగా వసూలు చేయడం చూశానని, సిబ్బంది తమ ప్రవర్తనను మార్చుకోవాలని హెచ్చరించారు. చాలా మంది పేదలు రాత్రి వేళల్లో వైద్యం కోసం వస్తుంటారని, వారికి ఎమర్జెన్సీ వైద్య చికిత్సను అందించడానికి వైద్యులు ఎల్లప్పుడూ అందుబాటులో ఉండాలని కోరారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలు అందించాలని కోరారు. ఆయన వెంట మాజీ కార్పొరేటర్ దాసరి ఉమాదేవి, సాంబమూర్తి ఉన్నారు.

కాగా, ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో ఎన్ని విభాగాల వైద్యులు అందుబాటులో ఉన్నారు, రోగులు ఎంత మంది వస్తున్నారని కళాశాల ప్రిన్సిపాల్ హిమబిందును అడిగి తెలుసుకున్నారు. అన్ని డిపార్ట్‌మెంట్ల వైద్యులు అందుబాటులో ఉండాలని, ఏయే పోస్టులు ఖాళీగా ఉన్నాయో తనకు వివరాలు ఇవ్వాలని, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితో ఈనెల 9న జరిగే సమీక్ష సమావేశంలో ఆసుపత్రికి కావాల్సిన సౌకర్యాలు, ఖాళీ పోస్టులపై ముఖ్యమంత్రితో చర్చించనున్నట్లు, ఆసుపత్రిలో పని చేస్తున్న సిబ్బందిని మానిటరింగ్ చేస్తూ రోగులకు మరిన్ని వైద్యసేవలు అందించాలని వైద్యులను కోరారు. ఈ సమీక్ష సమావేశంలో ప్రిన్సిపాల్ హిమబిందు, సూపరింటెండెంట్ దయాల్‌సింగ్, వైద్యులు, అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యా ప్రమాణాలు పెరిగేలా తొలిమెట్టు కార్యక్రమం

- కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

పెద్దపల్లి రూరల్, జనవరి 4 : పాఠశాలలో చదువుతున్న ప్రతి విద్యార్థి విద్యా ప్రమాణాలు పెరిగేలా తొలిమెట్టు కార్యక్రమాన్ని కట్టుదిట్టంగా అమలుచేయాలని కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ తెలిపారు. గురువారం ఆయన పెద్దపల్లి మండలం అప్పన్నపేట గ్రామంలో పర్యటించి ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న ప్రాథమిక స్థాయి పాఠశాలల సముదాయ సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రైమరీ టీచర్స్ కాంప్లెక్స్ మీటింగ్‌లో ఉపాధ్యాయులు ప్రదర్శించిన టీఎల్‌ఎం ద్వారా విద్యా బోధనను కలెక్టర్ పరిశీలించారు. అనంతరం కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ మాట్లాడుతూ ప్రాథమికస్థాయి నుంచి విద్యార్థుల విద్యా ప్రమాణాలు దృఢంగా నెలకొల్పేందుకు తొలిమెట్టు కార్యక్రమాన్ని ప్రభుత్వం ప్రత్యేకంగా రూపొందించిందన్నారు. ప్రతి విద్యార్థికి కనీస విద్యా ప్రమాణాలు అందే దిశగా ఉపాధ్యాయులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల పట్ల కొంతమంది ప్రజలకు ఉన్న అపోహలు తొలగించే దిశగా, పాఠశాలలు మంచి ఫలితాలు సాధించే దిశగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. విద్యార్థుల విద్యా ప్రమాణాలు పెరిగే విధంగా పటిష్ట కార్యాచరణ అమలుచేయాలని కలెక్టర్ తెలిపారు. ఉపాధ్యాయుల కృషి వల్లే తొలిమెట్టు సక్సెస్ అవుతుందని, అందరూ ఆత్మసాక్షిగా, పట్టుదలతో పనిచేస్తే పాఠశాలస్థాయి మరింత ఉన్నతంగా మారుతుందన్నారు. తద్వారా రాబోయే తరం నాణ్యమైన సమాజాన్ని నిర్మిస్తుందన్నారు. ఉపాధ్యాయులు పంచసూత్రాలైన ఐదు అంశాలను దృష్టిలో పెట్టుకొని విద్యార్థుల, పాఠశాల అభివృద్ధికి తోడ్పడాలన్నారు. విద్యార్థుల హాజరు శాతంపై ప్రత్యేక దృష్టి పెట్టి తల్లిదండ్రులను సంప్రదించాలని, సరైన కారణాలు తెలుసుకొని విద్యార్థులు ప్రతిరోజు పాఠశాలకు క్రమం తప్పకుండా వచ్చే విధంగా చూడాలని సూచించారు. విద్యార్థులకు బేస్‌లైన్ టెస్ట్ నిర్వహించి విద్యార్థుల వాస్తవిక సామర్థ్యాల ఆధారంగా బోధన చెయ్యాలని, ఉపాధ్యాయుల హాజరుపై కూడా ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రతి ఉపాధ్యాయుడు టీఎల్‌ఎం ప్రణాళిక రూపొందించుకొని దాని ఆధారంగా విద్య బోధన చేయాలని కలెక్టర్ సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రస్తుతం ఉన్న స్థితిగతులు, ఉపాధ్యాయులు చేస్తున్న కృషి, కల్పించబడ్డ వసతులు, అలాగే విద్యార్థులు సాధించిన ఫలితాలు అందరికి తెలిసేలా ముఖ్యంగా తల్లిదండ్రులకు తెలిసేలాగా చేయాలన్నారు. తరగతి గదిలో జరిగే బోధన విధానాన్ని విద్యార్థులు చేసే కృత్యాలను తల్లిదండ్రులకు వాట్సాప్ గ్రూపుల ద్వారా పంపించాలని తెలిపారు. ప్రతి మూడో శనివారం జరిగే పేరెంట్స్, టీచర్స్ సమావేశంలో పిల్లల యాక్టివిటీస్‌ని తల్లిదండ్రులకు తెలియజేసినప్పుడు పాఠశాలపై నమ్మకం కలుగుతుందని సూచించారు. ప్రస్తుతం విద్యార్థుల విద్యా ప్రమాణాలపై బేస్‌లైన్ పరీక్ష నిర్వహించి, వాస్తవిక నివేదికలను సమర్పించాలన్నారు. వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ధ వహిస్తూ వారి ప్రమాణాలు మెరుగుపరిచే దిశగా ఉపాధ్యాయులు చర్యలు తీసుకోవాలని సూచించారు. అప్పన్నపేట జడ్పీ ఉన్నత పాఠశాలలో యూరినల్స్ ఏర్పాటుకు ప్రతిపాదనలు సమర్పించాలని సంబంధిత ఇంజనీరింగ్ అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో మండల విద్యాధికారి సురేందర్, పాఠశాల ప్రధానుపాధ్యాయులు కాంప్లెక్స్ హెచ్‌ఎం పురుషోత్తం, సీఆర్పీలు, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## జాతీయ స్థాయి పోటీలకు విద్యార్థుల ఎంపిక




విద్యార్థులకు సర్టిఫికెట్లు అందిస్తున్న ఎమ్మెల్యే విజయరమణారావు

పెద్దపల్లి కల్చరల్, జనవరి 4 : ఇటీవల గోదావరిఖనిలోని జవహర్ లాల్ నెహ్రూ స్టేడియంలో నిర్వహించిన రాష్ట్ర స్థాయి డాడ్జ్ బాల్ పోటీల్లో పెద్దపల్లి పట్టణంలోని గాయత్రి విద్యానికేతన్‌కు చెందిన 8వ తరగతి విద్యార్థులు బండి సాత్విక్, ఎండి ఇమ్రాన్‌లు అద్భుత ప్రతిభ కనబరిచి జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు గాయత్రి విద్యాసంస్థల చైర్మన్ అల్లెంకి శ్రీనివాస్ తెలిపారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన అభినందన కార్యక్రమంలో విజేతలకు స్థానిక ఎమ్మెల్యే విజయరమణారావు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను అభినందించారు. జాతీయ స్థాయి పోటీల్లో కూడా రాణించి, పాఠశాల పేరును, రాష్ట్ర ఖ్యాతిని పెంచాలని పేర్కొన్నారు. అనంతరం విద్యార్థులకు సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ రజనీశ్రీనివాస్, ప్రిన్సిపాల్ విజయ్, రజియుద్దీన్, పీఈటీలు స్రవంతి, నవీన్ పాల్గొన్నారు.

## కేంద్ర ప్రభుత్వ పథకాలపై ప్రచారం

సుల్తానాబాద్, జనవరి 4: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలకు సంబంధించిన ప్రచారయాత్ర గురువారం మండలంలోని గొల్లపల్లి గ్రామానికి చేరింది. స్థానిక గ్రామపంచాయతీ ఆఫీసు వద్ద ప్రచార రథం డిజిటల్ స్క్రీన్‌పై వీడియో ద్వారా పథకాలు, వాటి ప్రయోజనాలను గ్రామస్తులు తిలకించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి జాడి బాల్‌రెడ్డి, డాక్టర్ చొక్కారావు, సర్పంచ్ బండారి రమేష్, ఏఎన్‌ఎంలు జమునరాణి, స్వరూపరాణి తదితరులు పాల్గొన్నారు.

## గంజాయి నిర్మూలనకు స్పెషల్ డ్రైవ్

- రామగుండం సీపీ రెమా రాజేశ్వరి

కోల్‌సిటీ, జనవరి 4: గంజాయి నిర్మూలనకు రామగుండం కమిషనరేట్‌లో స్పెషల్ డ్రైవ్ నిర్వహించనున్నట్టు రామగుండం సీపీ రెమా రాజేశ్వరి చెప్పారు. గురువారం టాస్క్‌ఫోర్స్ పోలీసుల ఆధ్వర్యంలో గోదావరిఖని వన్‌టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని విఠల్‌నగర్, తిలక్‌నగర్ ప్రాంతాలకు చెందిన ఇద్దరు వ్యక్తుల నుంచి 80గ్రాముల డ్రై గంజాయిని పట్టుకున్నారు. కమిషనరేట్ పరిధిలో గంజాయి నిల్వలు, అమ్మకాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసినట్టు, క్షేత్రస్థాయిలో గంజాయి అమ్ముతున్న వారిపై నిఘా పెట్టి వారు జైలు నుంచి వచ్చిన తరువాత ఏం చేస్తున్నారనే విషయాలపై ఎప్పటికప్పుడు ఆరాతీస్తున్నట్టు చెప్పారు. గంజాయి అడ్డాలను గుర్తించి గంజాయి సేవించే వారికి కౌన్సెలింగ్ ఇస్తూ గంజాయి వాడకం వల్ల కలిగే నష్టాలపై అవగాహన కల్పిస్తున్నట్టు చెప్పారు. నిందితులను విచారణ కోసం గోదావరిఖని వన్‌టౌన్ పోలీసులకు అప్పగించారు.

## మిషన్ భగీరథ నీటి సరఫరాలో అంతరాయం

- పైపుల లీకేజీలతో రోడ్డుపై ప్రవహిస్తున్న నీరు



ధర్మారంలో రహదారిపై ప్రవహిస్తున్న మిషన్ భగీరథ నీరు

ధర్మారం, జనవరి 4: మండల కేంద్రంలో తాగునీటి కోసం ప్రజలు తంటాలు పడుతున్నారు. మూడు నెలల నుంచి మిషన్ భగీరథ నీటి సరఫరాలో తీవ్రఅంతరాయం కలుగుతోంది. దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తహసీల్దార్ కార్యాలయం ఎదురుగా ఉన్న బ్రిడ్జి పక్కన వేసిన మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ అయి రాష్ట్ర రహదారిపై ప్రవహిస్తోంది. నీటి సరఫరా విషయంలో స్థానిక పంచాయతీ సిబ్బంది పట్టించుకోవాలని, మిషన్ భగీరథ శాఖ అధికారులు చెబుతున్నారు. బ్రిడ్జి వద్ద మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ కావడంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారు. తాగునీటి కోసం ఇంటి యజమానులు ట్యాంకులో నీటిని నింపి ఇంటికి తీసుకువస్తున్నారు. మిషన్ భగీరథ పైపులు లీకేజీ అవుతున్నా అధికారులు పట్టించుకోవడం లేదు. రోడ్డుపై మిషన్ భగీరథ పైపులైన్ లీకై నీరంతా వృథాగా ప్రవహిస్తోంది. ఇప్పటికైనా సంబంధిత శాఖ అధికారులు పట్టించుకొని మరమ్మతులు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

### వాహనాల తనిఖీ

మానకొండూర్, జనవరి 4: మానకొండూర్‌లోని తూర్పుదర్వాజ బస్టాండ్ వద్ద సీఐ రాజ్‌కుమార్ ఆధ్వర్యంలో పోలీసులు వాహనాలను గురువారం రాత్రి తనిఖీ చేశారు. ఇసుక లారీలు, వాహనాల కాగితాలు, డ్రంకన్‌డ్రైవ్ నిర్వహించారు. తనిఖీల్లో ఎస్సై శ్రీకాంత్‌తో పాటు సిబ్బంది పాల్గొన్నారు.



## యువతి గొంతుకోసిన యువకుడు

**- ప్రేమ వేధింపులే కారణం**



బొద్దుల సాయి, ఆడెపు కావ్యశ్రీ(ఫైల్)

కరీంనగర్ క్రైం, జనవరి 4: తనతో పెళ్లికి నిరాకరించిందని ఓ యువకుడు యువతితో గొడవ పడి ఆమె గొంతుకోశాడు. కొత్తపల్లికి పట్టణానికి చెందిన ఆడెపు కావ్యశ్రీ(26) అనే యువతి ఇంటిలోకి గురువారం సాయంత్రం అదే పట్టణానికి చెందిన బొద్దుల సాయి అనే యువకుడు వెళ్లాడు. కావ్యశ్రీతో గొడవపడి, ఆ తరువాత వెంట తెచ్చుకున్న కత్తితో ఆమెపై దాడి చేశాడు. మెడకు ఇరువైపులా గాయపరచగా, చేతులు అడ్డుపెట్టిన సమయంలో కావ్యశ్రీ వేళ్లకు గాయాలయ్యాయి. కరీంనగర్ రూరల్ ఏసీపీ, యువతి కుటుంబ సభ్యుల వివరాల ప్రకారం గురువారం సాయంత్రం కావ్యశ్రీ ఇంటిలో ఒంటరిగా ఉండగా కత్తి దాడి చేశాడు. గాయపడ్డ కావ్యశ్రీ అరవడంతో అక్కడికి వచ్చిన స్థానికులను చూసి సాయి పారిపోయాడు. విషయం తెలుసుకున్న కావ్యశ్రీ బాబాయి శ్రీనివాస్ వచ్చి చూసేసరికి ఆమె రక్తపుమడుగులో సొమ్మసిల్లి పడిపోయి ఉంది. వెంటనే ఆమెను వాహనంలో కరీంనగర్‌లోని ఒక ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం కావ్యశ్రీకి వైద్య చికిత్సలు అందిస్తున్నారని, ఆమె ఆరోగ్యపరిస్థితి నిలకడగానే ఉందని ఏసీపీ టి కరుణాకర్‌రావు తెలిపారు. నిందితుడు సాయి కోసం పోలీసు టీంలు గాలింపు ప్రారంభించాయని తెలిపారు. పెళ్లికి నిరాకరించడంతోనే సాయి దాడికి పాల్పడ్డాడని ప్రాథమిక విచారణలో వెల్లడైనట్లు తెలిపారు. కాగా కావ్యశ్రీ ఎదురు ఇంటిలోనే సాయి ఉంటాడు. నాలుగు ఏళ్ల నుంచి కావ్యశ్రీ, సాయిల మధ్య ప్రేమ వ్యవహారం నడుస్తోంది. పలుమార్లు పెద్దల సమక్షంలో పంచాయితీ కూడా జరిగినట్లు తెలిసింది. కావ్యశ్రీ ఎమ్మెస్సీ మ్యాథ్స్ పూర్తిచేసి ఉద్యోగ ప్రయత్నాల్లో ఉండగా, సాయి ఒక ఇసుక క్వారీలో ఉద్యోగం చేస్తున్నాడు. నీ కూతురును నాకంటే ఎవరూ బాగా చూసుకోలేరు.. తనకు నాతో వివాహం చేయాలంటూ వారం రోజుల కిందటే కావ్యశ్రీ తండ్రి వీరేశంకు సాయి ఒక మెస్సేజ్‌ను పంపించాడు. దీనిని వీరేశం పట్టించుకోలేదు. దీంతో గురువారం కూడా మరోమారు మెస్సేజ్‌ను పంపించాడు. అయినప్పటికీ ఎలాంటి స్పందన లేకపోవడంతో కావ్యశ్రీ ఇంటి వద్ద ఒంటరిగా ఉందని నిర్ధారించుకున్న సాయి పథకం ప్రకారమే వెంట కత్తి తీసుకొని కావ్యశ్రీ వద్దకు వెళ్లాడు. తనను పెళ్లి చేసుకోవాలంటూ సాయి ఒత్తిడి తెచ్చి గొడవపడ్డాడు. అయినప్పటికీ ఆమె పెళ్లికి నిరాకరించటంతో కత్తితో మెడపై రెండు వైపులా తీవ్రంగా గాయపరిచాడు. చేతి వేళ్ల తెగిపోయి తీవ్ర రక్తస్రావమైంది. సాయిపై హత్యాయత్నం కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఏసీపీ తెలిపారు.

### 9న మధ్యప్రదేశ్ మాజీ సీఎం రాక

మానకొండూర్, జనవరి 4: మండలంలోని కొండపల్కల గ్రామానికి మధ్యప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి శివరాజ్‌సింగ్ చౌహాన్ రానున్నట్లు ఎంపీడీవో రాజేశ్వర్‌రావు తెలిపారు. వికసితు భారత్ సంకల్ప యాత్రలో భాగంగా ఈ నెల 9న మాజీ సీఎం పాల్గొనే సభ స్థలాన్ని అధికారులతో కలిసి బీజేపీ జిల్లా అధ్యక్షుడు గంగాడి కృష్ణారెడ్డి గురువారం పరిశీలించారు. కార్యక్రమంలో బీజేపీ జాతీయ ప్రధాన కార్యదర్శి కరీంనగర్ ఎంపీ బండి సంజయ్, సర్పంచు నల్ల వంశీధర్‌రెడ్డి, ఎంపీటీసీ జిల్లా ప్రధాన కార్యదర్శి గుర్రాల వెంకట్‌రెడ్డి పాల్గొన్నారు.

### బెల్ట్‌షాప్‌లో మద్యం సీజ్

సిరిసిల్ల క్రైం, జనవరి 4: సిరిసిల్ల పట్టణంలోని పెద్దూరు గ్రామం బాబాజీనగర్‌లోని ఓ బెల్ట్‌షాప్‌లో కడమంచి ఎల్లవ్వ అనే మహిళ గురువారం అక్రమంగా నిల్వ చేసిన మద్యం సీజ్‌చేశారు. సిరిసిల్ల వైన్స్‌ల నుంచి అక్రమంగా మద్యం తీసుకొచ్చి బెల్ట్‌షాప్‌లో అధికధరలకు విక్రయిస్తున్నారని, ఈ మేరకు రూ. 2340విలువ గల మద్యం సీజ్ చేశామని టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని తెలిపారు.



## హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రి తనిఖీ

**- సాధారణ ప్రసవాలు పెంచాలని సిబ్బందికి డీఎంహెచ్‌వో సూచన**

హుజూరాబాద్, జనవరి 4: హుజూరాబాద్ ఏరియా ఆస్పత్రిని డీఎంహెచ్‌వో లలితాదేవి గురువారం తనిఖీ చేశారు. ఆస్పత్రిలో బీపీ, పీపీ, ఐసీటీసీ హెల్ప్ డెస్క్‌లను పరిశీలించారు. గర్భిణులకు నాణ్యమైన సేవలందించాలని సిబ్బందికి సూచించారు. అనంతరం ఆమె మాట్లాడారు. ఏరియా ఆస్పత్రిలో సాధారణ ప్రసవాలు ఎక్కువగా అయ్యేలా సిబ్బంది చూడాలని ఆదేశించారు. అలాగే శంకరపట్నం, చల్లూరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో సాధారణ ప్రసవాలు జరుగుతాయని తెలిపారు. అనంతరం పట్టణంలోని మామిండ్లవాడలో ఉప కేంద్రం స్థలాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో కరీంనగర్, హుజూరాబాద్ సూపరింటెండెంట్లు డాక్టర్ కృష్ణప్రసాద్, డాక్టర్ రాజేందర్‌రెడ్డి, ఆర్ఎంవో డాక్టర్ సుధాకర్‌రావు, డాక్టర్ నారాయణరెడ్డి, పంజాల ప్రతాప్, సాజీత్ హుస్సేన్, తులసి రవీందర్ తదితరులు పాల్గొన్నారు.

## అయ్యప్ప ఆలయంలో ఎంపీ ప్రత్యేక పూజలు



అయ్యప్ప ఆలయంలో పూజలు చేస్తున్న ఎంపీ బండి సంజయ్‌కుమార్

చొప్పదండి, జనవరి 4: పట్టణంలోని శ్రీవేంకటేశ్వర మణికంఠ ఆలయం తొమ్మిదో వార్షికోత్సవం సందర్భంగా గురువారం ఎంపీ బండి సంజయ్‌కుమార్ ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఎంపీకి ఆలయ కమిటీ సభ్యులు, అయ్యప్ప స్వాములు, భక్తులు స్వాగతం పలికి శాలువాతో సత్కరించారు. అయ్యప్ప స్వామి కృపా కటాక్షాలు ఎల్లవేళలా ప్రజలపై ఉండాలని, ఆలయ అభివృద్ధికి ఎల్లవేళలా కృషి చేస్తానని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు బొడిగె వెంకటేశ్, ప్రధాన కార్యదర్శి చేపూరి సత్యనారాయణ, గురుస్వాములు గొల్లపెల్లి శ్రావణ్ కుమార్, సింహాచలం హరికృష్ణ, బొడిగె వెంకన్న, ఎన్నం మునీందర్, ఉప్పికె రాజశేఖర్ రెడ్డి, మునిగాల సుధాకర్, ఎలిగేటి రాములు, కట్ట సత్యం, బత్తిని ప్రశాంత్, పోతు రాజు, బైరగోని కిట్టుగౌడ్, గుర్రం సమర్ రెడ్డి, కటుకం శశాంక్, కొత్తూరి శంకర్ పాల్గొన్నారు.

### పురుగుల మందు తాగి ఒకరి ఆత్మహత్య



కుమారస్వామి(ఫైల్)

ఇల్లందకుంట, జనవరి 4: మండలంలోని పాతర్లపల్లి గ్రామానికి చెందిన నందికొండ కుమారస్వామి (46) పురుగుల మందు తాగి ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. కుమారస్వామికి ఇద్దరు కుమార్తెలు, కొడుకు, భార్య ఉన్నారు. ఇద్దరు కూతుళ్ల వివాహం చేశాడు. ఈ సందర్భంలో రూ. 3.50లక్షలు అప్పు చేశాడు. అప్పు ఎలా చెల్లించాలని భార్యతో చెప్పుకుంటూ బాధపడే వాడు. ఈ క్రమంలో అతడు మద్యానికి బానిసయ్యాడు. గురువారం ఉదయం ఇంట్లో ఎవరు లేని సమయంలో పురుగుల మందు తాగాడు. స్థానికులు జమ్మికుంటలోని ప్రభుత్వాస్పత్రికి తరలించారు. వైద్యుల సూచన మేరకు వరంగల్ ఎంజీఎం ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. మృతుడి భార్య రేణుక ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నామని ఎస్సై రాజకుమార్ తెలిపారు.

### తప్పిన ప్రమాదం



మంటలను ఆర్పుతున్న అగ్నిమాపక సిబ్బంది

హుజూరాబాద్‌రూరల్, జనవరి 4: కరీంనగర్-వరంగల్ ప్రధాన రహదారి పై లోడ్‌తో వెళ్తున్న లారీ మండలంలోని సింగాపూర్ గ్రామానికి చేరుకోగానే లారీ టైర్ల నుంచి మంటలు చేలరేగాయి. గమనించిన గ్రామానికి చెందిన ఇజ్జిగిరి ప్రభాకర్ అగ్నిమాపక శాఖాధికారులకు సమాచారం అందించాడు. వారు హుటాహుటిన సంఘటన స్థలానికి చేరుకొని మంటలను ఆర్పి వేశారు. సకాలంలో మంటలను ఆర్పివేయడంతో పెను ప్రమాదం తప్పింది. లారీ డ్రైవర్, గ్రామస్థులు అగ్నిమాపక సిబ్బందికి కృతజ్ఞతలు తెలిపారు.



## షార్ట్‌సర్క్యూట్‌తో లారీకి మంటలు



మంటలు అంటుకున్న లారీ

గంగాధర, జనవరి 4: గంగాధర మండలం ఒద్యారం గ్రామ పెంట్రోల్ పంపులో ప్రమాదవశాత్తు లారీకి మంటలు అంటుకుని క్యాబిన్ కాలిపో యింది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. గ్రానైట్ లారీ సిబ్బంది స్థానిక హెచ్‌పీ పెట్రోల్ పంపులో డిజీల్ పోయిస్తున్నారు. ఆ సమయంలో ప్రమాదవశాత్తు షార్ట్‌సర్క్యూట్‌తో మంటలు అంటుకుని క్యాబిన్ కాలిపోయింది, బంకులోనే మంటల్లో లారీ చిక్కుకుంది. పెంట్రోల్ పంపు సిబ్బంది అప్రమత్తమై మంటలను ఆర్పివేశారు. పంపులకు మంటలు వ్యాపించితే పెనుప్రమాదం జరిగేదని స్థానికులు వాపోయారు.



### రూ.6,800 పలికిన పత్తి ధర

జమ్మికుంటరూరల్, జనవరి 4: జమ్మికుంట వ్యవసా య మార్కెట్లో క్వింటాల్ పత్తి ధర 6,800 రూపాయలు పలికింది. గురువారం మార్కెట్ యార్డుకు 88 మంది రైతులు 894 క్వింటాళ్ల విడి పత్తి, తొమ్మిది మంది రైతులు 14 క్వింటాళ్ల గోనే సంచుల్లో విక్రయానికి తీసుకు వచ్చారు. ప్రైవేట్ ట్రేడర్స్ బహిరంగ వేలం పాట ద్వారా గరిష్ఠ ధర 6,800, కనిష్ఠ ధర 5,500 రూపాయలు చెల్లించి కొనుగోలు చేశారు.

### వారసంతలో దొంగల చేతి వాటం

హుజూరాబాద్, జనవరి 4: హుజూరాబాద్ వారసం తలో దొంగలు చేతి వాటం ప్రదర్శించారు. ప్రతి గురు వారం హుజూరాబాద్ మున్సిపాలిటీ కార్యాలయం ఎదుట వారసంత జరుగుతుంది. పట్టణ ప్రజలు కూరగా యలు కొనుకునేందుకు మార్కెట్‌కు రాగా చందుపట్ల రాంమూర్తి అనే ఉపాధ్యాయుడి సెల్‌ఫోన్‌ను గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేశారు. మూడు నెలల క్రితం కూడా ఇలాగే సెల్‌ఫోన్‌లు దొంగలిం చారు. వారసంతపై పోలీసులు నిఘా పెట్టాలని పలువురు కోరుతున్నారు.

### కౌన్సిలర్ భర్తపై కేసు

సిరిసిల్ల క్రైం, జనవరి 4: సిరిసిల్ల పట్టణంలోని 37వ వార్డు కౌన్సిలర్ భర్తపై గురువారం కేసు నమోదైంది. వార్డులో నిర్వహిస్తున్న ప్రజాపాలనలో మరో అంబికానగర్ 23వ వార్డు నివాసి అయిన ఆడేపు చంద్రకళ దరఖాస్తు సమర్పించేందుకు రావడంతో కౌన్సిలర్ భర్త దిడ్డి రాజు అభ్యంతరం వ్యక్తం చేయడమే కాకుండా బెదిరింపులకు పాల్పడ్డాడని బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ ఫిర్యాదు మేరకు 37వ వార్డు కౌన్సిలర్ భర్త దిడ్డి రాజుపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు టౌన్ సీఐ ఉపేందర్ తెలిపారు. ఇదే సంఘటనలో తనపైనే నలుగురు దాడికి యత్నించారని కౌన్సిలర్ భర్త దిడ్డి రాజు ఫిర్యాదు మేరకు ఆడేపు చంద్ర కళ, వంగరి దేవదాసు, కొక్కుల రాజు, గడ్డం కిరణ్‌లపై కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.



## పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించాలి

**● వరంగల్ ప్రాంతీయ విద్యా సంచాలకులు సత్యనారాయణరెడ్డి**

హుజూరాబాద్‌రూరల్, జనవరి 4: పదో తరగతి ఫలితాల్లో ఉత్తమ ఫలితాలు సాధించేలా ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని వరంగల్ ప్రాంతీయ విద్యా సంచాలకులు సత్యనారాయణరెడ్డి అన్నారు. గురువారం మండలంలోని చెల్పూర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పది పరీక్షలకు సమయం చాలా తక్కువగా ఉందన్నారు. సబ్జెక్టుల వారిగా ఉపాధ్యాయులు ప్రతిరోజు ప్రత్యేక తరగతులను నిర్వహించాలని సూచించారు. చదువులో వెనుకబడిన విద్యార్థులపై ప్రత్యేక శ్రద్ద తీసుకోవాల న్నారు. గత పరీక్షల్లో విద్యార్థుల పురోగతిని ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. ఈ ఏడాది వార్షిక పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో హెచ్ఎం అనురాధ, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.





## నిరుపయోగంగా మానకొండూర్ బస్టాండ్

**● 23 ఏళ్లుగా వినియోగంలోకి తీసుకురాని అధికారులు ● రోడ్డుపైనే బస్సుల కోసం ప్రయాణికుల నిరీక్షణ**



మానకొండూర్‌లో నిరుపయోగంగా మారిన ఆర్టీసీ బస్టాండ్

మానకొండూర్, జనవరి 4: మానకొండూర్ ఆర్టీసీ బస్టాండ్ 23 ఏళ్లుగా ఉపయోగంగా ఉంది. లక్షలు వెచ్చించి బస్టాండ్ నిర్మించి రెండు దశాబ్దాలు దాటినా ఆర్టీసీ బస్సు ఇప్పటి వరకు వెళ్లలేదు. ఎవరూ పట్టించుకోకపోవడంతో రాత్రి వేళల్లో మందు బాబులకు అడ్డాగా మారింది. మరుగుదొడ్లు, మూత్రశాలలను ధ్వంసం చేసి నీటి కుళాయిలు పగులగొట్టారు. మెయిన్‌రోడ్డుపైనే బస్సులు నిలుపుతుండటంతో రోడ్డుపై వెళ్లే వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. కొన్ని సందర్భాల్లో ప్రమాదాలు కూడా జరుగుతున్నాయి. ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, ఆర్టీసీ అధికారులు ఇప్పటికైనా పట్టించుకుని బస్టాండ్ లోపలికి బస్సులు వచ్చేలా చూడాలని ప్రజలు కోరుతున్నారు.

## పదిహేను రోజుల వ్యవధిలో తల్లీతండ్రి మృతి

● అనాథలైన ఇద్దరు కూతుళ్లు

కోనరావుపేట, జనవరి 4: పదిహేను రోజుల క్రితం అనారోగ్యంతో తల్లీతండ్రి మృతి చెందడంతో వారి ఇద్దరు కూతుళ్లు అనాథలయ్యారు. కోనరావుపేట మండలం ధర్మారం గ్రామానికి చెందిన నేరెళ్ల కనకవ్వ (54), దేవయ్య (60) కూలీ చేసుకుంటూ కుటుంబాన్ని పోషించుకునే వారు. వీరికి ఇద్దరు కూతుళ్లు గంగ, జమున ఉన్నారు. నేరెళ్ల కనకవ్వ పదిహేను రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. గురువారం దేవయ్య పక్షవాతంతో మృతి చెందాడు. తల్లీతండ్రి మృతి చెందడంతో వీరి కూతుళ్లు అనాథలుగా మారారు. దేవయ్య అంత్యక్రియలకు కూడా డబ్బులు లేకపోవడంతో గ్రామస్థులు చందాలు పోగుచేసి అంత్యక్రియలు నిర్వహించారు. అనాథలైన ఆడపిల్లలను ప్రభుత్వం ఆదుకోవాలని గ్రామస్థులు కోరుతున్నారు.

## అక్రమ ఆయుధాల కేసులో మాజీ నక్సలైట్‌కు ఏడాది జైలు

సిరిసిల్ల క్రైం, జనవరి 4: అక్రమ ఆయుధాల కేసులో తంగళ్లపల్లి మండలంలోని చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన జక్కుల బాబు అనే మాజీ నక్సలైట్‌కు ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ. 2వేల జరిమానా విధిస్తూ అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శ్రీలేఖ గురువారం తీర్పు వెల్లడించారు. ప్రాషిక్యూషన్ వివరాల ప్రకారం... తంగళ్లపల్లి మండలం చిన్నలింగాపూర్ గ్రామానికి చెందిన జక్కుల బాబు సిపిఐ(ఎంఎల్) జనశక్తి నక్సలైట్‌గా ఏప్రిల్ 20, 2017న సిరిసిల్ల ప్రాంతానికి చెందిన కాంట్రాక్టర్లను బెదిరించి చందాలు వసూలు చేయాలని పథకం వేయగా జిల్లెల్ల చెక్ పోస్టు వద్ద పోలీసుల తనిఖీల్లో ద్విచక్రవాహనంపై వెలుతున్న బాబు వద్ద ఒక పిస్టల్, 20తూటాలు లభించాయి. ఈ మేరకు తంగళ్లపల్లి పోలీసులు అక్రమ ఆయుధాల చట్టం క్రింద కేసు నమోదుచేసి బాబుని రిమాండ్‌కు తరలించారు. అప్పటి కేసు విచారణ అధికారి లక్ష్మారెడ్డి కోర్టులో చార్జీ షీట్ దాఖలు చేశారు. ఈ కేసులో కోర్టు మానిటరింగ్ ఎస్ఐ శ్రీకాంత్, హెడ్‌కానిస్టేబుల్ సిహెచ్. శంకర్, కోర్టు కానిస్టేబుల్ నవీన్‌లు 10మంది సాక్షులను కోర్టులో ప్రవేశపెట్టారు. ఈ కేసు పూర్వాపరాలను పరిశీలించిన అసిస్టెంట్ సెషన్స్ కోర్టు న్యాయమూర్తి శ్రీలేఖ అట్టి నేరం రుజువు కావడంతో నిందితుడికి ఏడాది కఠిన కారాగార శిక్ష, రూ. 2వేల జరిమానా విధించారని తంగళ్లపల్లి ఎస్ఐ వెంకటేశ్వర్లు తెలిపారు.

## అనారోగ్య సమస్యతో ఆత్మహత్య

గంభీరావుపేట, జనవరి 4 : గంభీరావుపేట మండలం కొత్తపల్లి గ్రామంలో అనారోగ్య సమస్యతో ఒకరు ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గ్రామానికి చెందిన తంగళ్లపల్లి శ్రీనివాస్ (53) అనే వ్యక్తి తన వ్యవసాయ పొలం వద్ద చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. కటుంబ సభ్యులు, పోలీస్‌లు తెలిపిన వివరాల ప్రకారం.. శ్రీనివాస్ కులవృత్తితో పాటు వ్యవసాయం చేసుకుంటూ జీవనం సాగించేవాడు. 3 ఏళ్లుగా శ్రీనివాస్ కడుపు నొప్పితో బాధపడుతూ పలు ఆసుపత్రులు తిరుగుతున్నాడు. ఎన్ని ఆసుపత్రులు తిరిగినా కడుపునొప్పి తగ్గలేదు. దీనికి తోడు ఇటీవల బీపీ పెరగడం, రక్త కణాలు పెరగడంతో మళ్లీ ఆసుపత్రికి తీసుకెళ్లి చికిత్స చేయించారు. రోజు రోజుకు కడుపు నొప్పి తట్టుకోలేక పోతున్నానని ఇంట్లో శ్రీనివాస్ చెబుతుండేవాడు. గురువారం ఉదయం శ్రీనివాస్ పొలం వద్దకు వెళ్లి వస్తానని చెప్పి ఇంటికి రాలేదు. వారి బంధువులు పొలం వద్దకు వెళ్లి చూసే సరికి చెట్టుకు ఉరివేసుకుని చనిపోయి ఉన్నాడు. అనారోగ్య కారణాలతోనే తన భర్త ఆత్మహత్య చేసకున్నాడని మృతుడి భార్య స్రవంతి పోలీస్‌లకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ మహేష్ తెలిపారు.

## డ్రంకెన్‌డ్రైవ్‌లో ఏడుగురికి జైలు శిక్ష, జరిమానా

కరీంనగర్ క్రైం, జనవరి 4: కరీంనగర్‌లో మద్యం సేవించి వాహనాలు నడిపి పట్టుబడిన 29మంది వాహనదారులకు జైలుశిక్ష, జరిమానాలు పడ్డాయని కరీంనగర్ ట్రాఫిక్ ఏసీపీ మహ్మద్ సర్వర్ తెలిపారు. మద్యం సేవించి పట్టుబడిన ఏడుగురు వాహనదారులను గురువారం కరీంనగర్ మున్సిఫ్ మెజిస్ట్రేట్ ఎదుట హాజరు పరచగా ఇందులో ఇద్దరు వ్యక్తులకు పది రోజుల జైలు శిక్ష, జరిమానా, ఐదుగురు వ్యక్తులకు మూడు రోజుల జైలు శిక్ష, జరిమానా విధించారని తెలిపారు. మరో 22 మంది వాహనదారులకు 42,500 రూపాయల జరిమానా విధించినట్లు తెలిపారు. ప్రతిరోజు కరీంనగర్ పట్టణంలో డ్రంకెన్ డ్రైవ్, స్పెషల్ డ్రైవ్ ఉంటాయన్నారు. మద్యం సేవించి వాహనాలు నడిపితే జైలు శిక్ష అనుభవించవలసి ఉంటుందని అన్నారు. జైలు శిక్ష పడిన వ్యక్తుల డ్రైవింగ్ లైసెన్స్‌లు కూడా సస్పెండ్ చేయడానికి ఆర్టీఏ కార్యాలయానికి సిఫారసు చేస్తామని ఏసీపీ తెలిపారు.

## ఉరేసుకొని వలస కూలీ ఆత్మహత్య

రుద్రంగి, జనవరి 4: రుద్రంగి మండల కేంద్రంలో బుధవారం రాత్రి వలస కూలీ ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసుల వివరాల ప్రకారం.. ఛత్తీస్‌గఢ్‌లోని సుక్మా జిల్లా, పోండుమ్ గ్రామానికి చెందిన పాండ్రు రుద్రంగిలో భవన నిర్మాణ రంగంలో మేస్త్రీ వద్ద పనులు చేస్తున్నాడు. పిల్లలు కలగడం లేదని ఆవేదనతో పాటు, కుటుంబ కలహాలతో మనస్తాపం చెందాడు. రుద్రంగిలోని అద్దె భవనంలో ఉరేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై రాజేష్ తెలిపారు.

## రెండు రోజుల్లో వరదకాలువకు నీరు

- రైతులు ఆందోళన చెందవద్దు - ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం



వరద కాలువ

మల్యాల, జనవరి 4: రెండు రోజుల్లో వరదకాలుకు నీటిని విడుదల చేయనున్నట్లు ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం తెలిపారు. ఈ మేరకు చీఫ్ ఇంజనీర్ సుధాకరరెడ్డితో ఫోన్‌లో మాట్లాడిన ఎమ్మెల్యే ఇరిగేషన్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. నీటి విడుదల జాప్యం పట్ల మండిపడుతూ వెంటనే నీటిని విడుదల చేయాలని అన్నారు. కాలువలో నీరు లేక నియోజకవర్గంలోని నాలుగు మండలాల రైతులు సాగుకు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. దీంతో రెండు రోజుల్లో వరద కాలువకు నీరందిస్తామని సీఈ హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్యే తెలిపారు. రైతులు ఆందోళన చెందవద్దని కోరారు. సాగుకు ఇబ్బంది లేకుండా నీరందిస్తామన్నారు.

## రైస్‌మిల్లు తొలగించాలని కాలనీవాసుల ధర్నా



ధర్నాను విరమింపజేస్తున్న పోలీసులు

రాయికల్, జనవరి 4: రాయికల్ పట్టణంలోని 10వ వార్డులో ఏర్పాటు చేసిన రైస్‌మిల్లును తొలగించాలని కాలనీవాసులు గురువారం ధర్నా చేశారు. అంబేడ్కర్ కాలనీలో ఏర్పాటు చేసిన రైస్‌మిల్లు వలన చుట్టుపక్కల నివసించే ప్రజలకు రోగాలు వస్తున్నాయంటూ ఆవేదన వ్యక్తం చేశారు. అధికారులు, ప్రజాప్రతినిధులకు ఎన్నిమార్లు విన్నవించుకున్నా ఫలితం లేదని వాపోయారు. రామగుండం నుంచి అధికారులు వచ్చి పరిశీలించినా ఇప్పటివరకు ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదన్నారు. దాదాపు మూడు గంటల పాటు జరిగిన ధర్నాకు ఎలాంటి స్పందన రాలేదు. అధికారులు, ప్రజాప్రతినిధులు తక్షణమే చర్యలు తీసుకోవాలని కోరారు. ఏఎస్సై దేవేందర్ సిబ్బందితో వచ్చి వారికి నచ్చజెప్పి అధికారులతో మాట్లాడి సమస్య పరిష్కరిస్తామని హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు. ఈ ధర్నాలో డిఎస్‌పి మండల అధ్యక్షుడు పాలెపు జీవన్, తుడుం దెబ్బ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ఆత్రం రవీందర్, నిగ స్వామి, నిగ గంగరాజం, కాలనీవాసులు పాల్గొన్నారు.

# గల్ఫ్ హామీలపై ఆశలు

● తీరని గల్ఫ్ బాధిత కుటుంబాల సమస్యలు

● భారత్ జోడో యాత్రలో రాహుల్ గాంధీ హామీ

● తెరపైకి గల్ఫ్ సంక్షేమ బోర్డు.. ఎన్ఆర్ఐ బోర్డు

జగిత్యాల, జనవరి 4 (ఆంధ్రజ్యోతి): భారత్ జోడో యాత్రలో భాగంగా సంగారెడ్డి జిల్లా నిజాంపేట వద్ద 2022 నవంబరు 6వ తేదీన సాయంత్రం ఇద్దరు గల్ఫ్ మృతుల కుటుంబ సభ్యులు రాహుల్ గాంధీని కలిసి తమ గోడు వెళ్లబోసుకున్నారు. జగిత్యాల జిల్లా వెల్గటూరు మండలం కొండాపూర్‌కు చెందిన బచ్చల రాజనర్సయ్య షార్జాలో ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మృతుడి భార్య జమున రాహుల్‌ను కలిసిన బాధితుల బృందంలో పాల్గొని రాహుల్‌కు తమ బాధలను చెప్పుకుంది.

● నిర్మల్ జిల్లాకు చెందిన వలస కార్మికుడు మూడ అశోక్ అబుదాబిలో మృతి చెందాడు. అశోక్ 10 నెలల కూతురు సాత్విక, భార్య లక్ష్మీ రాహుల్‌ను కలిశారు. పసిపాప అమాయకపు చూపులు, గల్ఫ్ మృతుడి భార్య దీనావస్థ చూసి చలించిన రాహుల్ తన పక్కన ఉన్న అప్పటి మాజీ ఎంపీ, ప్రస్తుత మంత్రి పొన్నం ప్రభాకర్‌కు ఆ కుటుంబానికి సహాయం చేయాలని సూచించారు.

● ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల సందర్భంగా రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అభయహస్తం మేనిఫెస్టోలో గల్ఫ్ కార్మికుల సమస్యల అంశాన్ని ప్రస్తావించింది. 'గల్ఫ్ కార్మికులు, ఎన్ఆర్ఐల సంక్షేమం' పేరిట గల్ఫ్ సంక్షేమ బోర్డు, ఎన్ఆర్ఐల సంక్షేమ బోర్డు, గల్ఫ్ దేశాల్లో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్ గేషియా చెల్లింపు, టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ ఏర్పాటు అను నాలుగు హామీలను ఎన్నికలలో వివిధ సందర్భాల్లో కాంగ్రెస్ ఇచ్చింది. గతంలో ప్రతిపక్షంలో ఉన్న సమయంలో కాంగ్రెస్ గల్ఫ్ బాధితులకు సానుభూతి మాటలు తప్ప ఎటువంటి సహాయం చేయలేక పోయింది. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో ప్రభుత్వ పక్షాన గల్ఫ్ బాధితులకు ఆర్థిక సహాయం అందుతుందని, హామీలు నెరవేరుతాయన్న ఆశతో గల్ఫ్ కుటుంబాలు ఉన్నాయి.

### సుమారు 15 లక్షల మంది గల్ఫ్ కార్మికులు

గల్ఫ్ దేశాలలో తెలంగాణ ప్రాంతానికి చెందిన వలస కార్మికులు సుమారు 15 లక్షల వరకు ఉంటారని అంచనా ఉంది. ఇందులో కరీంనగర్ ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 3 లక్షలు, నిజామాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 2.50 లక్షలు, ఆదిలాబాద్ ఉమ్మడి జిల్లా నుంచి సుమారు 1.80 లక్షల మంది వివిధ దేశాలకు ఉపాధి నిమిత్తం వెళ్లినట్లు అంచనాలున్నాయి. ఇందులో అత్యధికంగా యూఏఈ, సౌదీ అరేబియా



ఆర్మూర్ వద్ద రాహుల్‌తో గల్ఫ్ బాధిత కుటుంబాలు(ఫైల్)

కాగా కువైట్, ఓమన్, ఖతార్, బహ్రెయిన్, మలేషియా, సింగపూర్ దేశాల్లో జిల్లాకు చెందిన పలువురు వలస కార్మికులు పనులు చేస్తున్నారు. అదే విధంగా పదేళ్లలో ఏడారి దేశాల నుంచి మరో సుమారు 15 లక్షల మంది వివిధ కారాణాలతో వాపస్ వచ్చి గ్రామాలలో సరైన ఉపాధి లేక ప్రభుత్వ సహాయం కోసం ఎదురుచూస్తున్నట్లు గల్ఫ్ సంక్షేమ సంఘాల నేతలు అంటున్నారు.

### అసెంబ్లీ ఎన్నికల్లో గల్ఫ్ సంఘాల నేతల పోటీ

ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో గల్ఫ్ సంఘాల నేతలు పోటీ చేశారు. ప్రధానంగా ఉమ్మడి కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్ జిల్లాల్లోని వివిధ అసెంబ్లీ నియోజకవర్గాల నుంచి బరిలో దిగారు. జగిత్యాల జిల్లా కోరుట్ల నియోజకవర్గం నుంచి గల్ఫ్ సంఘాల నేత చెన్నమనేని శ్రీనివాస్ రావు, ధర్మపురి నియోజకవర్గం నుంచి గల్ఫ్ వలస కార్మికుల హక్కుల కోసం పోరాడుతున్న గల్ఫ్ జేఏసీ రాష్ట్ర కార్యదర్శి బూత్కూరి కాంత, సిరిసిల్ల జిల్లా వేములవాడ నియోజకవర్గం నుంచి గల్ఫ్ జేఏసీ చైర్మన్ గుగ్గిల్ల రవి గౌడ్, నిర్మల్ అసెంబ్లీ నియోజకవర్గం నుంచి ప్రవాసీమిత్ర లేబర్ యూనియన్ అధ్యక్షుడు పరికిపండ్ల స్వదేశ్‌లు ఫార్వర్డ్ బ్లాక్ పార్టీ అభ్యర్థులుగా, సిరిసిల్ల అసెంబ్లీ నియోజకవర్గం నుంచి గల్ఫ్ కార్మికుల అవగాహన వేదిక అధ్యక్షుడు దొనికెల కృష్ణ పోటీ చేసి గల్ఫ్ సమస్య జాతీయ స్థాయిలో తెరపైకి వచ్చేలా ప్రయత్నించారు.

### అపరిష్కృతంగా సమస్యలు

ఉపాధి నిమిత్తం గల్ఫ్ దేశాలు, ఇతర దేశాలకు వలస వెళ్లిన కుటుంబాలు ఎదుర్కొంటున్న సమస్యలు అపరిష్కృతంగానే ఉంటున్నాయి. పదేళ్లలో గల్ఫ్ దేశాలలో మృతి చెందిన సుమారు రెండు వేల మంది తెలంగాణ వలస కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా, గల్ఫ్ బాధితులను ఆదుకోవడానికి రూ. 500 కోట్ల వార్షిక బడ్జెట్ కేటాయింపు, గల్ఫ్ బోర్డు, ఎన్ఆర్ఐ బోర్డు, సమగ్ర ఎన్ఆర్ఐ పాలసీ తదితర డిమాండ్‌లు నెరవేరడం లేదు. ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమి పాలై కాంగ్రెస్ అధికారంలోకి రావడంతో గల్ఫ్ బాధిత కుటుంబాల్లో మరోమారు ఆశలు చిగురిస్తున్నాయి.

నిజామాబాద్ జిల్లా ఆర్మూర్‌లో 2018 నవంబరు 29వ తేదీన జరిగిన ఎన్నికల ప్రచార సభలో జగిత్యాల జిల్లా రాయికల్‌కు చెందిన గల్ఫ్ విడో దండుగుల లక్ష్మీ తమ పిల్లలను వెంటబెట్టుకొని వచ్చి రాహుల్ గాంధీని కలిసి తమ బాధలు చెప్పుకుంది. ఒమన్ వెళ్లిన తన భర్త దండుగుల జనార్ధన్ అక్కడే గుండెపోటుతో మృతి చెందాడని, ఉన్న ఆధారం కోల్పోవడంతో తన ఇద్దరు పిల్లలు శశాంత్, అనిరుద్ జీవనం సాగించడం కష్టంగా మారిందని లక్ష్మీ ఆవేదన వ్యక్తం చేసింది. తమ ప్రభుత్వం వస్తే తప్పకుండా ఆదుకుంటామని రాహుల్‌గాంధీ వారికి హామీనిచ్చారు. ప్రస్తుతం రాష్ట్రంలో కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో దండుగుల లక్ష్మీ లాంటి అనేక కుటుంబాలు సమస్యలు పరిష్కారం అవుతాయనే ఆశతో ఉన్నారు.

### నాలుగు హామీలు అమలు చేయాలి

- మంద భీంరెడ్డి, ఎమిగ్రంట్స్ వెల్ఫేర్ ఫోరం అధ్యక్షుడు



ఇటీవల జరిగిన రాష్ట్ర అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ పార్టీ తన అభయహస్తం మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలను అమలు చేయాలి. ఎన్ఆర్ఐ సంక్షేమ బోర్డు, గల్ఫ్ సంక్షేమ బోర్డు, గల్ఫ్ దేశాల్లో చనిపోయిన కార్మికుల కుటుంబాలకు రూ. 5 లక్షల ఎక్స్‌గ్రేషియా, టోల్ ఫ్రీ హెల్ప్‌లైన్ ఏర్పాటు నాలుగు హామీలు అమలు చేయాల్సిన అవసరముంది.

## ఆటో, లారీ ఢీ : ఆరుగురికి గాయాలు

అంతర్గాం, జనవరి 4: అంతర్గాం మండల పరిధిలోని బ్రాహ్మణపల్లి క్రాస్ రోడ్డు వద్ద గురువారం లారీ, ఆటో ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో ఆటోలో ప్రయాణిస్తున్న ఆరుగురికి గాయాలయ్యాయి. ఎస్ఐ సంతోష్‌కుమార్ తెలిపిన వివరాల ప్రకారం.. పెద్దపల్లి మండలం అందుగులపల్లికి చెందిన ఒకే కుటుంబానికి చెందిన ఆరుగురు కొయ్యడ నారాయణ, చంద్రశేఖర్, కనుకమ్మ, నందిని, రిషిత, మేఘనలు గోలివాడ గోదావరి నదికి స్నానాలకు వెళుతున్నారు. అదే సమయంలో బ్రాహ్మణపల్లి నుంచి రామగుండం వెళుతున్న లారీ బ్రాహ్మణపల్లి క్రాస్‌రోడ్డు వద్ద ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తాపడి అందులో ప్రయాణిస్తున్న ఆరుగురు గాయాలపాలయ్యారు. అంతర్గాం పోలీసులు సంఘటన స్థలాన్ని సందర్శించి క్షతగాత్రులను 108లో చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. ఆటో డ్రైవర్ అంతగిరి సదయ్య ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ సంతోష్ కుమార్ తెలిపారు.



ప్రదానికి గురైన ఆటో, క్షతగాత్రులను ఆసుపత్రికి తరలిస్తున్న స్థానికులు

## విద్యుత్ మోటార్లు, కేబుళ్లను చోరీ చేస్తున్న వ్యక్తి పట్టివేత

కోల్‌సిటీ, జనవరి 4: గోదావరిఖనిలోని నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లలో విద్యుత్ వైర్లను, గ్రామలోని పొలాల వద్ద ఉన్న మోటార్లను, విద్యుత్ వైర్లను చోరీ చేస్తున్న ఎన్‌టీపీసీ పోరటపల్లికి చెందిన మేకల రాకేష్ అనే వ్యక్తిని గోదావరి వంతెన వద్ద జనగామ గ్రామస్థులు పట్టుకుని పోలీసులకు అప్పగించారు. మార్కండేయకాలనీ, దుర్గానగర్, ఆర్‌టీసీ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న ఇళ్లలో విద్యుత్ వైర్ల చోరీకి పాల్పడుతున్న వ్యక్తిని అదుపులోకి తీసుకోగా ఎన్‌టీపీసీకి చెందిన నలుగురు ఒక ముఠాగా ఏర్పడి చోరీలకు పాల్పడుతున్నట్టు తెలుస్తున్నది. అదుపులోకి తీసుకున్న వ్యక్తిని పోలీసులు విచారిస్తున్నారు.

## ధర్మపురిలో కాలభైరవుడి ఆలయం ప్రారంభం

ధర్మపురి, జనవరి 4: ధర్మపురి క్షేత్రంలోని ఇసుక స్తంభం పక్కన కాలభైరవుడి ఆలయాన్ని గురువారం ప్రారంభించారు. ధర్మపురి వాసి, పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ గోలి పూర్ణచందర్ దంపతులు రూ 5.50 లక్షలు స్వంతంగా ఖర్చు చేసి ఈ ఆలయాన్ని నిర్మించారు. స్థానిక వేదపండితులు మధు శంకర్‌శర్మ, పాలెపు ప్రవీణ్ శర్మ, పాలెపు శివ, జ్యోతిష్య పండితులు పాలెపు బద్రీనాథ్‌శర్మ ఉదయం శాస్త్రోక్తంగా అభిషేకం, ప్రత్యేక పూజలు, హారతి కార్యక్రమాలు నిర్వహించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శనం చేసుకున్నారు. భక్తులకు తీర్థ, ప్రసాద వితరణ జరిపారు. ఈ కార్యక్రమంలో ధర్మపురి కోర్టు జూనియర్ సివిల్ జడ్జి శ్యాంప్రసాద్, మున్సిపల్ వైస్‌చైర్మన్, ఆలయ రినోవేషన్ కమిటీ సభ్యులు ఇందారపు రామయ్య, 11 వ వార్డు కౌన్సిలర్ జక్కు పద్మ-రవీందర్, ఆలయ నిర్మాతలు డాక్టర్ గోలి పూర్ణచందర్ దంపతులు, గోలి రాంకిషన్, గోలి శ్రీనివాస్, భక్తులు పాల్గొన్నారు.



కాలభైరవుడి ఆలయ ప్రారంభ పూజలు

## జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక



తక్షిల్ (ఫైల్)

కొడిమ్యాల, జనవరి 4: మండల కేంద్రంలోని (విద్యాభారతి)విజ్‌డమ్ ఉన్నత పాఠశాలలో పదోతరగతి చదువుతున్న మండల కేంద్రానికి చెందిన ఎర్రోజు తక్షిల్ స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆఫ్ ఇండియా ఆధ్వర్యంలో ఈ నెల 16 నుంచి 23 వరకు (67వ)జాతీయ స్థాయిలో నిర్వహించే అండర్ 17 క్రికెట్ క్రీడలకు ఎంపికైనట్లు జిల్లా ఎస్‌జీఎఫ్ సెక్రటరీ లక్ష్మీరాజంనాయక్, ఉమ్మడి కరీంనగర్ జిల్లా అండర్ 17 క్రికెట్ జట్టు కోచ్ లింగంపెల్లి డేవిడ్‌సన్ బుధవారం తెలిపారు. బీహార్ రాష్ట్రంలోని పాట్నాలో తెలంగాణ జట్టు నుంచి ప్రాతినిధ్యం వహించనున్నాడు. గద్వాల్‌లో గత నెలలో జరిగిన రాష్ట్ర స్థాయి క్రికెట్ పోటీలలో పాల్గొని అత్యధిక పరుగులు(143)సాధించి బ్యాట్స్ మెన్‌గా మొదటి స్థానంలో నిలిచాడు. ప్రస్తుతం హైదరాబాదులోని భవన్స్ క్రికెట్ అకాడమీలో శిక్షణ పొందుతున్నాడు. గ్రామీణ ప్రాంతానికి చెందిన ఎర్రోజు తక్షిల్ జాతీయ స్థాయి క్రికెట్ పోటీలకు ఎంపిక కావటం పట్ల క్రీడాకారునికి విజ్‌డమ్ పాఠశాల ప్రిన్సిపాల్ దీకొండ అశోక్, కొడిమ్యాల క్రికెట్ క్లబ్ అధ్యక్షుడు రాపర్తి లక్ష్మన్, సభ్యులు అభినందించారు.

## రాష్ట్రస్థాయి సాఫ్ట్‌బాల్ పోటీలకు ఎంపిక

కరీంనగర్ స్పోర్ట్స్, జనవరి 4: నిజామాబాద్ జిల్లా ఆర్మూరులో ఈ నెల 16, 17, 18 తేదీల్లో జరగనున్న పాఠశాలల క్రీడా సమాఖ్య అండర్-14 బాలబాలికల సాఫ్ట్‌బాల్ పోటీల్లో పాల్గొనే కరీంనగర్ ఉమ్మడి జిల్లా జట్ల వివరాలను జిల్లా ఎస్‌జీఎఫ్ కార్యదర్శి పోతన శ్రీనివాస్ గురువారం ప్రకటించారు. ఇటీవల ఉమ్మడి జిల్లా స్థాయిలో నిర్వహించిన అండర్-14 సాఫ్ట్‌బాల్ పోటీల్లో విశేష ప్రతిభచాటిన క్రీడాకారులను రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపిక చేశామని ఆయన పేర్కొన్నారు. ఎంపికైన క్రీడాకారులు ఈనెల 6వ తేదీలోపు ఎలిజిబులిటీ ఫామ్, డేట్ ఆఫ్ బర్త్ సర్టిఫికెట్స్, ఆధార్ జిరాక్స్‌లు నాలుగు సెట్లు తీసుకుని కార్యదర్శిచే సంతకం చేయించుకోవాలన్నారు.

**బాలికల విభాగంలో..**

సీహెచ్ అక్షయ(గుల్లకోట), కె తేజని(గుల్లకోట), వి శరణ్య(గుల్లకోట), బి శ్రీనిధి (గుల్లకోట), పి మిత్ర(జగిత్యాల), పి అపూర్వ(మొగిలిపాలెం), ఎం సహస్రమాల(జగిత్యాల), డి శ్రీహర్షిణి(ఇల్లందకుంట), నందిని(కరీంనగర్), జి హన్సిక(కరీం నగర్), జి అక్షర(నందిమేడారం), వి శివాణి(చొప్పదండి), ఎస్ సాయిశరణ్య(మొగిలిపాలెం),బి వర్షిత(నగునూరు), ఎ రమాదేవి(మానకొండూర్), సహలసామ(కరీంనగర్)లు ఎంపికయ్యారు.

**బాలుర విభాగంలో..**

ఎల్ సిద్ధు(గుల్లకోట), పి ఆర్యన్(గుల్లకోట), జి మణితేజ(గుల్లకోట), పి వివేక్(తాటిపల్లి), కె వినయ్(వేగురుపల్లి), ఎం రఘు(వేగురుపల్లి), బి రాంచరణ్(అన్నారం), చంద్రశేఖర్ రెడ్డి(మొగిలిపాలెం), ఆర్ సామ్యుల్(ధర్మారం), ఓ ఈశ్వర్(కరీంనగర్), జి రాంచరణ్(చొప్పదండి),జైశంత్(తాటిపల్లి),ఆశిష్‌రెడ్డి(మొగిలిపాలెం), జె నీరవ్(కరీంనగర్), ఎం శివతేజ(పెద్దపల్లి), సీహెచ్ మహేందర్ రెడ్డి(ఊటూరు) ఎంపికయ్యారు.

## మృతదేహం లభ్యం

వేములవాడ టౌన్, జనవరి 4 : నాంపల్లి గుడిబండ చెరువులో మృతదేహం లభ్యమైనట్లు టౌన్ సీఐ కరుణాకర్ తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... వేములవాడ మున్సిపల్ పరిధిలోని నాంపల్లి గుడిబండ చెరువులో మృతదేహం గుర్తించిన గ్రామస్థులు పోలీసులకు సమాచారం అందించారని, దీంతో సంఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు చెరువులో నుంచి మృతదేహాన్ని వెలికితీయగా నిజామాబాద్ జిల్లా మెండోర మండలం పోచంపపాడు గ్రామానికి చెందిన చిట్యాల రామకృష్ణ అలియాస్ రాజేష్(45)గా గుర్తించారు. మృతికి గల కారణాలు తెలియరాలేదని కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## ద్విచక్ర వాహనాలు చోరీ చేసిన నిందితుడి పట్టివేత

జగిత్యాల టౌన్, జనవరి 4 : జగిత్యాల జిల్లా కేంద్రంలో కొన్ని రోజులుగా ద్విచక్ర వాహనాలను అపహరించుకెళ్తున్న నిందితుడిని జగిత్యాల పట్టణ పోలీసులు పట్టుకున్నారు. గురువారం రాత్రి టౌన్ పోలీస్‌స్టేషన్‌లో డీఎస్పీ వెంకటస్వామి విలేకరుల సమావేశం నిర్వహించి వివరాలు వెల్లడించారు. జిల్లా కేంద్రంలోని తారకరామ నగర్ ప్రాంతానికి చెందిన బాణాల చిరంజీవి అనే యువకుడు వ్యసనాలకు బానిసై దొంగగా మారాడు. పట్టణంలోని పలు ప్రాంతాల్లోని తమ ఇళ్ల ముందు నిలిపిన వాహనాలను అపహరించుకవెళ్లి విక్రయించి సొమ్ముచేసుకోవడం చిరంజీవి ప్రవృత్తిగా మార్చుకున్నాడు. వరుసగా ద్విచక్ర వాహనాలు చోరీకి గురి కావడంతో జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు టౌన్ సీఐ నటేష్ ఆధ్వర్యంలో పోలీసులు గురువారం పట్టణంలోని పలు ప్రాంతాల్లో విస్తృత తనిఖీలు నిర్వహించారు. కొత్త బస్టాండ్ ప్రాంతంలో అనుమానస్పద స్థితిలో ద్విచక్ర వాహనంపై వెళుతున్న వ్యక్తి పట్టుకుని విచారించారు. ద్విచక్ర వాహనాల దొంగగా గుర్తించి 10 వాహనాలను స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ వివరించారు.



నిందితుడిని అరెస్టు చూపిస్తున్న డీఎస్పీ

# ఆగని ఇసుక అక్రమ దందా

● అనుమతులు లేకున్నా సరఫరా

ఎల్లారెడ్డిపేట, జనవరి 4: ఇసుక అక్రమ రవాణా ఆగడం లేదు. ఎల్లారెడ్డిపేట మండలంలో ఇసుక వ్యాపారులు నిరంతరం వాగుల్లోని ఇసుకను ట్రాక్టర్లు, పికప్‌లు, టిప్పర్లలో జిల్లా సరిహద్దులు దాటిస్తున్నారు. పర్యవేక్షించాల్సిన అధికారులు పట్టించుకోకపోవడంతో ఇసుక రవాణా జోరుగా సాగుతోంది. మండలంలోని పదిర, వెంకటాపూర్, అగ్రహారం, సింగారం శివారులోని మానేరు వాగు నుంచి ఇసుకను అక్రమార్కులు తరలిస్తున్నారు. ప్రభుత్వ, ప్రైవేటు పనుల కోసం స్థానిక తహసీల్ అధికారులు ప్రతి బుధ, శనివారాల్లో వెంకటాపూర్ శివారులోని మానేరు వాగు నుంచి ఇసుక రవాణాకు అనుమతి జారీ చేస్తున్నారు. ఇటీవల అనుమతి లేకుండానే ఇసుక తరలింపు కొనసాగుతోంది. ఓ శాఖ అధికారులు ఇసుక తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకున్నారు. తహసీల్ కార్యాలయంలోని ఓ అధికారి తన సమీప బంధువును మధ్యవర్తిగా ఏర్పాటు చేసుకొని దందాకు తెరలేపుతున్నారనే ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. ఇసుక రవాణా చేయాలంటే క్యూబిక్ మీటర్ లెక్కన బ్యాంకులో డీడీ చెల్లించి తహసీల్దార్ అనుమతి పొందాలి. ఇక్కడ అలాంటిదేమీ మచ్చుకైనా కనిపించడం లేదు. కార్యాలయానికి సమీపంలోని ఓ దుకాణంలో సదరు అధికారి బంధువును కలిసి వ్యాపారులు పైకం ఇచ్చుకుంటే చాలు ఎన్ని ట్రిప్పుల ఇసుకనైనా తరలించుకోవచ్చు. ఒక్కో ట్రాక్టర్‌కు ప్రతివారం రూ.1500, పికప్‌కు రూ.3వేలు, టిప్పరుకు రూ.10 వేల చొప్పున డబ్బు పుచ్చుకుంటున్నారనే విమర్శలున్నాయి. బుధ, శనివారాల్లో సుమారు 50 ట్రాక్టర్లు, 20 వరకు పికప్‌లు, 10 టిప్పర్లు ఇసుకను రవాణా చేస్తున్నాయని స్థానికులు ఆరోపిస్తున్నారు. ఇసుక దందాతో ప్రభుత్వ ఆదాయానికి గండి పడుతోంది. ప్రభుత్వ ఖాతాలో జమకావాల్సిన సొమ్ము కొంతమంది అధికారుల జేబుల్లోకి వెళ్తోందనే ఆరోపణలు ఉన్నాయి. ఒక్కో గ్రామం నుంచి ప్రతీ బుధ, శనివారాల్లో నడిచే ట్రాక్టర్ల వ్యాపారులు కలిపి రూ.10 వేలు చెల్లించాలని నిర్ణయించినట్లు ఆరోపణలు ఉన్నాయి.



ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్

### డీడీలు చెల్లిస్తేనే అనుమతి

రాంచందర్, తహసీల్దార్, ఎల్లారెడ్డిపేట

మండలంలో ఇసుక తరలింపునకు డీడీలు చెల్లిస్తేనే అనుమతులు జారీ చేస్తున్నాం. ఎలాంటి అవకతవకలు ఉన్నా విచారణ జరిపి చర్యలు తీసుకుంటాం. ఇసుక అక్రమ రవాణాపై కఠినంగా వ్యవహరిస్తాం.

### అక్రమంగా ఇసుక తరలిస్తే చర్యలు

రమాకాంత్, ఎస్సై, ఎల్లారెడ్డిపేట

అనుమతి లేకుండా ఇసుకను తరలిస్తే చర్యలు తీసుకుంటున్నాం. అక్రమ రవాణాపై ప్రత్యేక దృష్టి సారించాం. అనుమతి పత్రం ఉండి సమయం దాటి పోయినా ఇసుకను తరలిస్తున్న ట్రాక్టర్లను పట్టుకొని కేసులు నమోదు చేస్తున్నాం.

# ప్రజా పాలన సభల్లో దరఖాస్తుల వెల్లువ

- ప్రభుత్వ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలి - రేషన్ కార్డుల దరఖాస్తులకు ప్రత్యేక కౌంటర్ - కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్


ప్రజా పాలనలో దరఖాస్తుదారులతో కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



దరఖాస్తులు తీసుకుంటున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయరమణారావు

కోల్‌సిటీ, జనవరి 4: ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఆరు గ్యారంటీ పథకాలను అర్హులు వినియోగించుకోవాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. గురువారం రామగుండం మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 41, 42డివిజన్లలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమాన్ని ఆయన పరిశీలించారు. ప్రజాపాలన కేంద్రాలకు వచ్చిన ప్రజలతో కలెక్టర్ మాట్లాడారు. వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కేంద్రాలలో తాగునీటి సమస్య, ఇతర ఏ సమస్యలు ఉన్నాయా అని, ప్రభుత్వాసుపత్రిలో మెరుగైన వైద్య సేవలు అందుతున్నాయా అని ఆరా తీశారు. వైద్యం కోసం వెళితే అక్కడి సిబ్బంది ఎలా స్పందిస్తున్నారని అడిగితెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రేషన్‌కార్డుల దరఖాస్తులకు ప్రత్యేక కౌంటర్ ఏర్పాటు చేసి దరఖాస్తులు స్వీకరించాలని, వచ్చిన దరఖాస్తులను కంప్యూటర్‌లో నమోదు చేయాలని సిబ్బందికి సూచించారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులను ఏర్పాటు చేసి కార్పొరేట్ విద్యాలయాలకు దీటుగా విద్యాబోధనను అందిస్తున్నామని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో నైపుణ్యం, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు పనిచేస్తున్నారని, ప్రభుత్వ పాఠశాలలకు పిల్లలకు పంపాలని కలెక్టర్ మహిళలకు సూచించారు. ప్రజా పాలన కేంద్రాలకు వచ్చే ప్రతి దరఖాస్తును తీసుకోవాలని, దరఖాస్తులను తిరస్కరించడానికి వీలు లేదని స్పష్టం చేశారు. జనవరి 6వరకు ప్రజల నుంచి దరఖాస్తులు స్వీకరిస్తామని చెప్పారు. ప్రభుత్వ ఆరు గ్యారంటీలతో పాటు ఇతర సమస్యలపై కూడా దరఖాస్తులు స్వీకరిస్తున్నామని, వీటి కోసం ప్రత్యేక కౌంటర్లు ఏర్పాటు చేసి సమస్యలను పరిష్కరిస్తామని ఆయన చెప్పారు. ఈ కార్యక్రమంలో మేయర్ బంగి అనీల్ కుమార్, కమిషనర్ నాగేశ్వర్, కార్పొరేటర్లు బాల రాజ్‌కుమార్, గాదం విజయతో పాటు అధికారులు, అంగన్‌వాడీ, ఆశా వర్కర్లు పాల్గొన్నారు.

**యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 4:** కాంగ్రెస్ పార్టీ మ్యానిఫెస్టోలో ప్రకటించిన ఆరు గ్యారెంటీల అమలు చేసేందుకే అభయ హస్తం పేరిట ప్రజల నుంచి దరఖాస్తులను స్వీకరిస్తున్నట్టు రామగుండం ఎమ్మెల్యే మక్కాన్ సింగ్ పేర్కొన్నారు. గురువారం 14వ డివిజన్ వీర్లపల్లెలో జరిగిన ప్రజా పరిపాలన కార్యక్రమంలో దరఖాస్తుల స్వీకరణను ఎమ్మెల్యే ప్రారంభించారు. ఈసందర్భంగా మక్కాన్‌సింగ్ మాట్లాడారు. ప్రతి నిరుపేద కటుంబానికి ఆరు గ్యారెంటీల్లో భాగంగా మహాలక్ష్మి, గృహలక్ష్మి, గృహజ్యోతి, చేయూత పథకాలు అందేలా కృషి చేస్తానని ఎమ్మెల్యే పేర్కొన్నారు. పథకాల అమలుతో ప్రజల జీవన ప్రమాణ స్థాయి మెరగుపడుతుందని, పేదలకు అండగా ఈ సంక్షేమ పథకాలు నిలుస్తాయని అన్నారు. లబ్ధిదారుల ఎంపిక పారదర్శకంగా జరుగుతుందని, పథకాలు వచ్చేలా చేస్తామని ఎవరైనా ప్రలోభాలకు గురిచేస్తే పోలీసులకు సమాచారం ఇవ్వాలని, దళారుల మాయమాటలకు మోసపోవద్దని మక్కాన్‌సింగ్ సూచించారు. ఈ కార్యక్రమంలో మేయర్ అనిల్‌కుమార్, కమిషనర్ నాగేశ్వరరావు, కాంగ్రెస్ పార్టీ కార్పొరేషన్ అధ్యక్షుడు బొంతల రాజేష్, కార్పొరేషన్ ఫ్లోర్‌లీడర్ మహంకాళి స్వామి, నాయకులు నీల గణేష్‌తో పాటు ప్రజలు పాల్గొన్నారు.

**సుల్తానాబాద్, జనవరి 4:** గ్రామాలలో, పట్టణాలలో నిర్వహించే ప్రజా పాలన గ్రామ సభలలో అర్హులైన వారందరిచే ధరఖాస్తులు ఇప్పించే అధికారులదేనని ఎమ్మెల్యే విజయరమణారావు అన్నారు. సుల్తానాబాద్ మండలంలోని తొగర్రాయి, కదంబాపూర్ గ్రామాలలో, సుల్తానాబాద్ మున్సిపాలిటీ పరిధిలోని పదకొండు, పన్నెండవ వార్డులలో నిర్వహించిన ప్రజా పాలన గ్రామ సభల్లో ఎమ్మెల్యే పాల్గొని అర్హులైన వారినుంచి దరఖాస్తులను స్వీకరించారు. అనంతరం ఆయన మాట్లాడుతు అర్హులైన వారందరికి సంక్షేమ పథకాలు వస్తాయని ఎలాంటి ఆందోళన వద్దన్నారు. తొగర్రాయి గ్రామంలో మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలుక సతీష్ శ్రీను అనిల్ తదితర కాంగ్రెస్ కార్యకర్తలు అభిమానులు ఎమ్మెల్యేను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమాల్లో జడ్పీటీసీ మినుపాల స్వరూపప్రకాశ్‌రావు, సర్పంచ్ కర్క తిరుమల శంకర్‌రెడ్డి, కోడం సురేఖఅజయ్, వైస్‌ఎంపీపీ కోట స్వప్నరాంరెడ్డి, కౌన్సిలర్లు రాజయ్య, తిరుపతి కమిషనర్ మల్లికార్జున్, ఎంపీవో ఫయాజ్‌అలీ, ఏఈ సతీష్ నాయకులు అంతటి అన్నయ్యగౌడ్, దామోదర్‌రావు, శ్రీగిరి శ్రీనివాస్, చిలుక సతీష్, అబ్బయ్యగౌడ్, బిరుదు క్రిష్ణ, కిశోర్, తిరుపతి, అమీనొద్దిన్ తదితరులు పాల్గొన్నారు.

**ధర్మారం, జనవరి 4 :** మండలంలోని నర్సింహులపల్లి, సైడిచింతలపల్లి, సాయంపేట గ్రామాల్లో గురువారం ప్రజాపాలన గ్రామ సభలు జరిగాయి. మండలంలో ఇప్పటి వరకు 28గ్రామాల్లో జరిగిన అభయహస్తంలో 16368 మంది దరఖాస్తులు అందాయని, 2639 ఇతర దరఖాస్తులు అధికారులు వివరించారు. గ్రామసభల్లో ఎంపీడీవో బి జయశీల, తహసీల్దార్ ఏ, రజిత, ఎంపీవో రమేష్, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

**మంథని, జనవరి 4:** ప్రభుత్వ 6 గ్యారెంటీ సంక్షేమ పథకాల అమలు కోసం నిర్వహించిన ప్రజాపాలన సదస్సులకు దరఖాస్తుల స్వీకరణ గురువారం జరిగింది. మంథని మున్సిపల్ పరిధిలోని 6, 13వ వార్డుల్లో జరిగిన


కొమిరలో దరఖాస్తులను పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్

ప్రజాపాలన సదస్సులో అధికారులకు ప్రజలు తమ దరఖాస్తులు సమర్పించారు. 6 గ్యారెంటీ స్కీంలో మహాలక్ష్మి పథకం, రైతు భోరోసా, గృహజ్యోతి, చేయూత పెన్షన్, ఇందిరమ్మ ఇండ్లు, ఉచిత విద్యుత్ రూ.500 గ్యాస్ సిలిండరులాంటి పథకాల కోసం ప్రజలు దరఖాస్తులను అందజేశారు. మండలంలోని గ్రామాల్లో జరిగిన ప్రజాపాలన సదస్సుల్లో ప్రజలు దరఖాస్తులను అధికారులకు అందజేశారు.

**ఎలిగేడు, జనవరి 4 :** రాష్ట్రంలో అర్హులైన వారందరికీ ఆరు గ్యారంటీ పథకాలను వర్తింపచేస్తామని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని లోకపేట, రాములపల్లి గ్రామాల్లో గురువారం ప్రజాపాలన కార్యక్రమాలు నిర్వహించగా ఆయన లోకపేట ప్రజాపాలన గ్రామసభలో పాల్గొని రామాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం ఆయన మాట్లాడారు. ఆరు గ్యారంటీ పథకాలపై ప్రజలు అపోహ చెందవద్దని, అర్హులైన ప్రతి ఒక్కరికీ రాష్ట్ర ప్రభుత్వ న్యాయం చేస్తుందని పేర్కొన్నారు. రైతుబంధు పథకంపై కొందరు పనిగట్టుకొని చేస్తున్న ప్రచారంలో వాస్తవం లేదని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఎల్లప్పుటు పేద అట్టడుగు వర్గాల సంక్షేమం కోసం పనిచేస్తుందని అన్నారు. ఈ కార్యక్రమాల్లో సర్పంచ్‌లు దేవరనేని ప్రభావతి, చిలుముల సౌమ్య, మండల స్పెషల్ ఆఫీసర్ తిరుపతిరావు, మధుసూదనాచారి, ఎంపీడీవో శ్రీనివాసమూర్తి, తహసీల్దార్ స్వర్ణ, ఎంపీవో అనిల్‌రెడ్డి, జీపీ కార్యదర్శి అభిజిత్, మాజీ సర్పంచ్ ఒద్దినేని ప్రసాద్‌రావు, వేణుగోపాల్‌రావు, ఏవో ఉమాపతి, ఐకేపీ ఏపీఎం సుధాకర్, ఏఈలు సంపత్‌రెడ్డి, జగదీశ్వర్, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర యువజన కార్యదర్శి దుగ్యాల సంతోష్‌రావు, మండల అధ్యక్షుడు సామ రాజేశ్వర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

**రామగిరి, జనవరి 4:** మండలంలోని ఆదివారంపేట్‌లో గురువారం ప్రజాపాలన నిర్వహించారు. గ్రామపంచాయతీ కార్యాలయంలో స్థానిక సర్పంచ్ మైదం కుమార్ అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఆర్డీవో హనుమానాయక్, ఎంపీపీ ఆరెల్లి దేవక్క హాజరయ్యారు. వివిధ పథకాలకు సంబంధించిన 468 మంది లబ్ధిదారులు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో అధికారులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

**ఓదెల, జనవరి 4 :** దరఖాస్తులు అందజేయని వారు ఆందోళన పడవద్దని, ప్రజాపాలన కార్యక్రమం నిరంతర ప్రక్రియని, ప్రతి నాలుగు నెలలకొకసారి ప్రజాపాలన ఉంటుందని అదనపు కలెక్టర్ శ్యాంప్రసాద్‌లాల్ అన్నారు. మండలంలోని కొలనూర్, కొమిరలో గురువారం నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలకు శ్యాంప్రసాద్‌లాల్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజలకు ఎలాంటి ఆటంకాలు లేకుండా అధికారులు, సిబ్బంది సౌకర్యాలను ఏర్పాట్లు పూర్తిచేస్తున్నారని, దరఖాస్తుల నమోదులో అంగన్‌వాడీ, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది సహాయం అందిస్తున్నారని వారిని అభినందించారు. దరఖాస్తు చేసుకుంటున్న ప్రతి ఒక్కరికి కూడా ప్రభుత్వ పథకాలు అమలు జరిగేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అలాగే దరఖాస్తుల స్వీకరణ గడువు తేదీ 6 దాటినా కూడా ఎంపీడీవో, ఎమ్మార్వో కార్యాలయాల్లో కూడా దరఖాస్తులను స్వీకరించే అవకాశం ఉందని తెలిపారు. ఈవిషయంలో ప్రజలు ఆందోళన పడాల్సిన అవసరం లేదన్నారు. అనంతరం దరఖాస్తుల నమోదును పరిశీలించి సూచనలు చేశారు. సర్పంచులు,అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

**పెద్దపల్లి రూరల్, జనవరి 4 :** మండలంలోని గౌరెడ్డిపేట, ముత్తారం, కనగర్తి, కాపులపల్లి గ్రామాల్లో గురువారం ప్రజా పాలన కార్యక్రమాలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామస్థుల నుంచి దరఖాస్తులను అధికారులు స్వీకరించారు. గౌరెడ్డిపేట గ్రామంలో నిర్వహించిన ప్రజా పాలన కార్యక్రమంలో పెద్దపల్లి ఎంపీపీ బండారి స్రవంతి-శ్రీనివాస్ పాల్గొన్నారు. ఈ కార్యక్రమాల్లో తహసీల్దార్ రాజ్‌కుమార్, ఎంపీడీవో రాజు, ఎంపీవో సుదర్శన్, పంచాయితి కార్యదర్శులు, గ్రామాల సర్పంచ్‌లు పాల్గొన్నారు.

**జూలపల్లి, జనవరి 4 :** అర్హులైన పేద ప్రజలందరికి అభయహస్తం ఆరు గ్యారంటీల సంక్షమ పథకాల హామీలను కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వం తప్పకుండా అమలుచేసి తీరుతుందని పెద్దపల్లి ఎమ్మెల్యే చింతకుంట విజయరమణారావు అన్నారు. మండలంలోని బాల్‌రాజ్‌పల్లి, జూలపల్లి గ్రామాల్లో గురువారం ప్రభుత్వం నిర్వహిస్తున్నా ప్రజాపాలన కార్యక్రమాన్ని అధికారులు ఏర్పాటుచేయగా ఎమ్మెల్యే విజయరమణారావు జూలపల్లిలో పాల్గొని ప్రజాపాలన కార్యక్రమాన్ని ప్రారంబి, ప్రజలు అందించిన దరఖాస్తులను ఆయన స్వీకరించారు. ఈసందర్భంగా ఏర్పాటుచేసి సమావేశంలో ఎమ్మెల్యే విజయరమనారావు మాట్లాడుతూ తమ ప్రభుత్వం ఇచ్చిన హామీల్లో ఇప్పటికి రెండు పథకాలను అమలుచేసామని, మరో నాలుగు పథకాలను ప్రజలకు అందించేందుకు ప్రభుత్వం అన్నివిదాలుగా కృతనిశ్చయంతో పనిచేస్తోందని, రాబోయే రోజుల్లో ప్రజలకు మరింతగా మెరుగైనా పాలనను అందిస్తామన్నారు.

ఈ కార్యక్రమంలో ప్రత్యేక అధికారులు డీఈవో మాధవి, తహసీల్దార్ బషిరుద్దిన్, ఎంపీపీ రమాదేవి, సర్పంచ్ దారబోయిన నర్సింహయాదవ్, ఎంపీడీవో వేణుగోపాల్‌రావు, ఏపీవో సదానందం, సింగిల్‌విండో ఛైర్మన్‌లు పుల్లూరి వేణుగోపాల్‌రావు, కొంజర్ల వెంకటయ్య, ఉపసర్పంచ్ కొప్పుల మహేష్, పంచాయతీ కార్యదర్శులు అనంతుల లచ్చయ్య, అంజలీదర్‌రావు, పున్నమయ్య, సంతోష్, నాయకులు లోక జలపతిరెడ్డి, మానుమండ్ల శ్రీనివాస్, అమరగాని లింగయ్యగౌడ్, గొట్టిముక్కుల రవిందర్‌రెడ్డి, ఏదుల్ల కనుకయ్య, కొమ్మ పోచాలు, బండి స్వామి, సిరికొండ కొమురయ్య, పెద్ద సంఖ్యలో ప్రజలు పాల్గొన్నారు.


ఆదివారంపేట్‌లో దరఖాస్తులను స్వీకరిస్తున్న ఆర్డీవో హనుమానాయక్


కాపులపల్లి గ్రామంలో దరఖాస్తులు అందిస్తున్న ప్రజలు

## తల్లిదండ్రుల కలలను సాకారం చేయాలి

- వైద్య విద్యార్థులతో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్


నూతన సంవత్సర వేడుకల్లో వైద్య విద్యార్థులతో ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, జనవరి 4: విద్యార్థులు తల్లిదండ్రుల కలను సాకారం చేయాలని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గురువారం రామగుండం మెడికల్ కళాశాలలో విద్యార్థులతో మాటమంతీ నిర్వహించి నూతన సంవత్సర వేడుకల్లో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు జీవితంలో ఉన్నత లక్ష్యాన్ని చేరాలంటే క్రమశిక్షణ, బాధ్యతతో విద్యను అభ్యసించాలన్నారు. అనంతరం కేక్‌కట్ చేసి మిఠాయిలను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ప్రొఫెసర్లు, అసిస్టెంట్లు ప్రొఫెసర్లు, వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

## 'ఖని'లో ఎగ్జిబిషన్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే


ఎగ్జిబిషన్ ప్రారంభోత్సవంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్

కళ్యాణ్‌నగర్, జనవరి 4: మానసిక ఉల్లాసం కోసం ఎగ్జిబిషన్ ఎంతో ఉపయోగపడుతుందని రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ రాజ్‌ఠాకూర్ అన్నారు. గురువారం గోదావరిఖని ప్రభుత్వ జూనియర్ కళాశాల మైదానంలో ఏర్పాటు చేసిన తాజ్‌మహల్ ఎగ్జిబిషన్‌ను ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పారిశ్రామిక ప్రాంత ప్రజలు సకుటుంబ సమేతంగా ఎగ్జిబిషన్‌ను సందర్శించేందుకు నిర్వాహకుడు అస్లాం ప్రతి ఏటా కొత్తరకమైన వినోదాన్ని కల్పిస్తున్నారని చెప్పారు. మహిళల కోసం వివిధ రాష్ట్రాల నుంచి తీసుకువచ్చిన గృహోపకరణాలు, హ్యాండ్ క్రాప్ జ్యువెల్లరీ ఐటమ్‌లు, వీల్ బ్రేక్ డ్యాన్స్, జంబోజెట్, చిన్న పిల్లల కోసం పార్కును ఏర్పాటు చేసినట్టు, దీనిని వినియోగించుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్లు కల్వల శిరీష, మహంకాళి స్వామి, బొంతల రాజేష్, పెద్దెల్లి తేజస్విని ప్రకాష్, ముస్తాఫా, నడిపెల్లి రాంమోహన్‌రావు, ఫక్రుద్దీన్, శ్రీనివాస్, తిప్పారపు శ్రీనివాస్, యుగంధర్, బొమ్మక రాజేష్, మారెల్లి రాజిరెడ్డి, గుండేటి రాజేష్, నిర్వాహకులు ఎండీ అస్లాం, మేనేజర్ శ్రీనివాస్, గుప్తా, సాగర్ పాల్గొన్నారు.




## కరోనాతో అప్రమత్తంగా ఉండాలి

రామగిరి, జనవరి 4: కరోనాతో స్వీయరక్షణను పాటిస్తూ అప్రమత్తంగా ఉండాలని హెల్త్‌అధికారి డాక్టర్ పద్మ సూచించారు. సింగరేణి సంస్థ ఏపీఏ డివిజన్ పరిధిలోని ఏఎల్‌పీలో నిర్వహించిన కోవిడ్ అవగాహన సదస్సులో ఆమె మాట్లాడారు. కరోనా పెరిగిపోతున్న నేపథ్యంలో ప్రతి ఒక్కరు స్వీయ రక్షణలో ఉండాలని తెలిపారు. చేతులు శుభ్రంగా ఉంచుకొవడం, పరిసరాలను పరిశుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. ప్రతి ఒక్క పౌష్టికాహారం తీసుకోవాలని, వీటితోపాటు విధిగా మాస్కులు ధరించాలని తెలిపారు. ఈ సమావేశంలో అధికారులు జనార్ధన్, రవిచంద్ర, ఉద్యోగులు పాల్గొన్నారు.

## నేడు ఆర్జీ-3లో నీటి సరఫరాకు అంతరాయం

రామగిరి, జనవరి 4: సింగరేణి సంస్థ ఆర్జీ-3 డివిజన్ పరిధిలోని సెంటినరీ కాలనీకి శుక్రవారం తాగునీటి సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని పర్సనల్ మేనేజర్ రవీందర్‌రెడ్డి ఒక ప్రకటనలో వెల్లడించారు. ఓసీపీ-1 సీహెచ్‌పీ వద్ద జరుగుతున్న పైపుల మరమ్మతుల దృష్ట్యా నీటి సరఫరాకు అంతరాయం కలుగుతుందని పేర్కొన్నారు. సెంటినరీకాలనీ వాసులు నీటిని పొదుపుగా వాడుకోవాలని ఆయన సూచించారు.

## సీఎండీని కలిసిన నాయకులు


సీఎండీ బలరాంనాయక్‌కు పుష్పగుచ్ఛం అందజేస్తున్న శంకర్‌నాయక్, అంబటి సంతోష్‌రావు, హర్కార వేణుగోపాల్‌రావు

యైటింక్లయిన్‌కాలనీ, జనవరి 4: సింగరేణి ఛైర్మన్ అండ్ మేనేజింగ్ డైరెక్టర్ బలరాంను ఐఎన్‌టీయూసీ సెంట్రల్ కమిటీ నాయకుడు, రామగుండం 15వ డివిజన్ కార్పొరేటర్ శంకర్ నాయక్ గురువారం కలిశారు. నూతన సీఎండీగా బాధ్యతలు స్వీకరించినందున పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. సంస్థ అభివృద్ధి, కార్మిక శ్రేయస్సుకు మరిన్ని సంక్షేమ కార్యక్రమాలు చేపట్టాలని కోరారు.

**గోదావరిఖని, జనవరి 4:** సింగరేణి సీఎండీగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన బలరాంనాయక్‌ను గురువారం హైదరాబాద్‌లోని సింగరేణి భవన్‌లో రామగుండం ప్రాంత నాయకుడు అంబటి సంతోష్‌రావు కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. సీఎండీగా పదవీ బాధ్యతలు చేపట్టిన బలరాంనాయక్ సంస్థను మరింత పురోగతి కోసం కృషి చేయాలని, మరిన్ని ఉన్నత పదవులు చేపట్టాలని ఆకాంక్షించారు.

అలాగే ఏఐసీసీ సభ్యుడు హర్కార వేణుగోపాల్‌రావు గురువారం సీఎండీ బలరాంను కలిసి శుభాకాంక్షలు తెలిపారు.

## అయ్యప్ప స్వాములకు భిక్ష

కళ్యాణ్‌నగర్, జనవరి 4: గోదావరిఖని గౌతమినగర్‌లోని అయ్యప్ప ఆలయంలో గురువారం రామగుండం ఎమ్మెల్యే మక్కాన్‌సింగ్ ప్రత్యేక పూజలు నిర్వహించి అనంతరం భక్తులకు భిక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శీతాకాలంలో మండల దీక్ష చేపట్టిన స్వాములు నియమ నిష్టలతో పూజలు నిర్వహించడం అభినందనీయమన్నారు. అయ్యప్పమాల ఆధ్యాత్మికం, ధ్యానాన్ని పెంపొందిస్తుందని చెప్పారు. మాల ధారణ ధరించిన ప్రతి అయ్యప్ప సాక్షాత్తు భగవత్ స్వరూపులేనన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు బెంద్రం సునీతరాజిరెడ్డితో పాటు పలువురు గురు స్వాములు, భక్తులు పాల్గొన్నారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన అడ్లూరి

ధర్మారం, జనవరి4: ధర్మారం మండల కేంద్రానికి చెందిన ప్రముఖ వ్యాపారవేత్త ఎలగందుల రాజేశం అనారోగ్యంతో బుధవారం రాత్రి మృతిచెందగా బాధిత కుటుంబాన్ని ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ పరామర్శించారు. గురువారం ధర్మారంలో రాజేశం పార్థివదేహానికి ప్రభుత్వ విప్, ధర్మపురి ఎమ్మెల్యే అడ్లూరి లక్ష్మణ్‌కుమార్ నివాళులర్పించారు. అడ్లూరి వెంట బ్రిలియంట్ విద్యాసంస్థల ఛైర్మన్ సిరిపురం సత్యనారాయణ, పలువురు వ్యాపారులు, నాయకులు ఉన్నారు.

## మృతుడి కుటుంబానికి మాజీ ఎమ్మెల్యే పరామర్శ

పెద్దపల్లి రూరల్, జనవరి 4 : పెద్దపల్లి మండలం నిట్టూరు మాజీ సర్పంచ్, బీఆర్ఎస్ నాయకులు ఆరెపల్లి వెంకట్రాజం తల్లి కొద్ది రోజుల క్రితం మృతిచెందగా గురువారం పెద్దపల్లి మాజీ ఎమ్మెల్యే దాసరి మనోహర్‌రెడ్డి వారి కుటుంబాన్ని పరామర్శించి సానుభూతి తెలిపారు. ఆయన వెంట కాసర్ల జనార్ధన్‌రెడ్డి, ఆకుల శ్రీనివాస్, వేణుగోపాల్‌రావు, రాజేశ్వర్‌రావు, రాజేశం, బుర్ర సందీప్ లు ఉన్నారు.

## ప్రజా పాలన దరఖాస్తులను విక్రయిస్తే చర్యలు

ముత్తారం, జనవరి 4 : ప్రజా పాలనకు సంబంధించిన దరఖాస్తులను జిరాక్స్ సెంటర్ యజమానులు విక్రయిస్తే కఠిన చర్యలు తప్పవని తహసీల్దార్ రాజేశ్వరి హెచ్చరించారు. దరఖాస్తు ఫారాలు గ్రామపంచాయతీ కార్యదర్శుల వద్ద, ఎంపీడీవో కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయని, కావలసినవారు తీసుకోవాలన్నారు. ఇప్పటికే గ్రామాల్లో ప్రజాపాలన కార్యక్రమానికంటే రెండు రోజుల ముందుగానే పంచాయతీ కార్యాలయంలో ప్రజలకు ఉచితంగా అందించడం జరిగిందని తెలిపారు. ఇప్పటికైనా జిరాక్స్ సెంటర్ యజమానులు ప్రజాపాలన దరఖాస్తులను విక్రయించటం మానుకోవాలని, లేనిచో చర్యలు తప్పవని తహసీల్దార్ హెచ్చరించారు.

## కాలువలో పడి 30 గొర్రెలు మృత్యువాత


భోజన్నపేటలో చనిపోయిన గొర్రెలు

పెద్దపల్లి రూరల్, జనవరి 4: పెద్దపల్లి మండలం భోజన్నపేట గ్రామానికి చెందిన గొల్లకుర్మలు తమ గొర్రెలను మేత కోసం హన్మంతునిపేట గ్రామం వైపు తీసుకెళ్తుండగా కెనాల్‌లో పడి 28 గొర్రెలు మృత్యువాత పడ్డాయి. దీనిపై పశు వైద్యాధికారి కమలాకర్‌లు వివరణ కోరగా గొర్రెలను కాలువ దాటిస్తుండగా కెనాల్‌లో కొద్దిపాటి నీరు ఉండటంతో అందులో మునిగి చనిపోయినట్లు పేర్కొన్నారు. మృతిచెందిన గొర్రెలకు పంచానామా నిర్వహించినట్లు తెలిపారు. వారివెంట భోజన్నపేట సర్పంచ్ మేకల మల్లేష్ యాదవ్, గొల్ల కుర్మలు పాల్గొన్నారు.

## వైభవంగా అనఘాష్టమి వ్రతం

మంథని, జనవరి 4: స్థానిక శ్రీదత్తాత్రేయస్వామి ఆలయంలో వైభవంగా శ్రీఅనఘాష్టమిస్వామి వ్రతాన్ని గురువారం వైభవంగా నిర్వహించారు. ఆలయ ఆవరణలో వేదోక్తంగా ఆలయ పూజారి కొల్లారపు వెంకట్రాజం దంపతులు ఈ వ్రతాన్ని ప్రత్యేక పీఠాన్ని అలంకరించి పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఆలయంలోని శ్రీదత్తాత్రేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈకార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.

## సీతారాముల వారి అక్షింతలు పంపిణీ


సీతారాముల వారి అక్షింతలను పంపిణీ చేస్తున్న నాయకులు

ఎలిగేడు, జనవరి 4: మండలంలోని సుల్తాన్‌పూర్ గ్రామంలో గురువారం అయోధ్య సీతారాముల అక్షింతలను గడప గడపకూ వెళ్లి పంపిణీ చేశారు. కార్యక్రమంలో బీజేపీ మండల మాజీ అధ్యక్షుడు గర్రెపల్లి నారాయణస్వామి, రాయపాక మనోహర్, అంజయ్య, వెంకటేశ్వర్‌రావు తదితరులు పాల్గొన్నారు.

## గురుకులాల్లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

పెద్దపల్లి కల్చరల్, జనవరి 4: ఎస్సీ, ఎస్టీ, బీసీ, జనరల్ గురుకుల పాఠశాలల్లో 2024-25 విద్యా సంవత్సరానికి 5వ తరగతి ఇంగ్లీష్ మీడియంలో ప్రవేశాల కోసం నిర్వహించనున్న ఉమ్మడి ప్రవేశ పరీక్షకు జనవరి 6లోగా దరఖాస్తు చేసుకోవాలని ఉమ్మడి జిల్లా మహాత్మా జ్యోతిబా పూలే తెలంగాణ గురుకుల విద్యాలయాల సమన్వయ అధికారి యం.గౌతమ్‌రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. 5వ తరగతిలో ప్రవేశాల కోసం ఫిబ్రవరి 11న ఉదయం 11గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు ఉమ్మడి ప్రవేశ పరీక్ష అన్ని జిల్లాలలోని ఎంపిక చేయబడిన కేంద్రాలలో నిర్వహిస్తామన్నారు. విద్యార్థులు ఆన్‌లైన్‌లో వంద రూపాయలు రుసుము చెల్లించి జనవరి 6లోగా దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. సమాచారం కోసం హెల్ప్‌లైన్ నెంబర్ 18004254567 8లో సంప్రదించాలన్నారు.

## కల్వచర్లలో కేంద్ర బృందం పర్యటన


వైద్య సిబ్బందిని వివరాలు అడిగితెలుసుకుంటున్న డాక్టర్ నరేంద్ర సింగొయ

రామగిరి, జనవరి 4: జాతీయ ఆరోగ్య నాణ్యతహామీ ప్రమాణాలపై కేంద్ర ప్రభుత్వం బృందం సభ్యులు డాక్టర్ నరేంద్ర సింగోయ, డాక్టర్ సచిన్‌కుమార్ సాహలు గురువారం మండలంలోని కల్వచర్ల గ్రామంలో పర్యటించారు. గ్రామీణ ప్రాంతాల్లో వైద్యులు, సిబ్బంది చేస్తున్న సేవాలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం ప్రజల కోసం ఆరోగ్యపరమైన అంశాలపై పట్టికలో పొందుపర్చిన వివరాలపై సిబ్బందిని ప్రశ్నించారు. కల్వచర్లలోని ఆరోగ్య కేంద్రానికి ప్రహరీ ఏర్పాటుకు కృషి చేయాలని స్థానిక సర్పంచ్ గంటపద్మకు టీం సభ్యులు సూచించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారి ప్రమోద్‌కుమార్, క్షయ వైద్యాధికారి సుధాకర్‌రెడ్డి, జిల్లా ఎస్పిడి అధికారి డాక్టర్ మధుకర్‌రెడ్డి, డాక్టర్ ప్రదీప్, కమ్యూనిటీ హెల్త్ ఆఫీసర్ భరత్, డిపిఎంవో జయకర్, ఏఎన్‌ఎంలు, ఆశా వర్కర్స్, ఫార్మసిస్టులు పాల్గొన్నారు.

## డబ్బులు కాజేసిన వారిపై చర్యలు తీసుకోవాలి

పెద్దపల్లి రూరల్, జనవరి 4 : మండలంలోని కాపులపల్లి గ్రామ మహిళ సంఘాల పొదుపు డబ్బులను సీఏతో పాటు మరొకరు కాజేశారని, సుమారు 26 లక్షల వరకు స్కాం చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని గురువారం సర్పంచ్ గోపు కవిత-శ్రీనివాస్, వార్డు సభ్యులు, మహిళలు అధికారులకు ఫిర్యాదు చేశారు. డబ్బులను రికవరీ చేయాలని వారు కోరారు.